ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
కోనసీమ
మంగళవారం 15 అక్టోబరు 2024



నాలుగు రోజుల పాటు..

వానలు కురిసే అవకాశం..!

అమలాపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు నాలుగు రోజుల పాటు వర్షాల ప్రభావం ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న మత్స్యకారులు ఎవరూ సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశమున్న దృష్ట్యా తీర ప్రాంత గ్రామాలతో పాటు మిగిలిన గ్రామాల ప్రజలు కూడా అప్రమత్తతో ఉండాలని అధికారులు కోరుతున్నారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా ఉదయం నుంచి రాత్రి వరకు దపదపాలుగా వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. అల్పపీడన ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో వచ్చిన మార్పు దృష్ట్యా అధికారులకు పూర్తిగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా విద్యుత్ లైన్లలో ఎక్కడైనా చెట్లు పడినా, ఇతర పరిస్థితులు ఏర్పడినా తక్షణమే సమీపంలోని విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించాని ఆ శాఖ అధికారులు కోరుతున్నారు. వాతావరణ పరిస్థితుల వల్ల ఏర్పడే ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు విద్యుత్‌శాఖ సిద్ధంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున చెట్ల వద్ద, విద్యుత్ లైన్ల వద్ద ప్రజలెవరూ ఉండొద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు.

యువత నైపుణ్యాభివృద్ధి సాధించాలి

చేనేత, జౌళి పార్లమెంటు కమిటీ సభ్యుడు గంటి హరీష్ మాధుర్



జౌళిశాఖ పార్లమెంటరీ కమిటీ సమావేశానికి హాజరైన ఎంపీ గంటి హరీష్‌మాధుర్

అమలాపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యువత నైపుణ్యాభివృద్ధి సహా చేనేత, జౌళి రంగాల్లో ప్రగతి సాధించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అమలాపురం పార్లమెంటు సభ్యుడు గంటి హరీష్ మాధుర్ అన్నారు. పార్లమెంటరీ కమిటీ సభ్యునిగా నియమితులైన ఆయన సోమవారం పార్లమెంటరీ భవన్‌లో జరిగిన తొలి కమిటీ సమావేశానికి హాజరయ్యారు. కార్మిక, జౌళి, నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బసవరాజు బొమ్మై వ్యవహరిస్తున్న ఈ కమిటీలో సభ్యునిగా తాను కొనసాగడం పట్ల హరీష్ హర్షం వ్యక్తం చేశారు. తొలి కమిటీ సమావేశంలో పలు అంశాలను ప్రస్తావించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆయన సూచనలు అమలుచేస్తూ రాష్ట్రంలో చేనేత, జౌళి రంగాల్లో ప్రగతి సాధనకు కృషి చేయడమే తన ముందున్న లక్ష్యమని ఈ సందర్భంగా హరీష్ పేర్కొన్నారు. తొలి కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన్ను సహచర కమిటీ సభ్యులు అభినందించారు.

పల్లె పండుగతో అభివృద్ధికి బాటలు

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంతో అభివృద్ధికి బాటలు పడుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు, పంచాయతీరాజ్ మంత్రి పవన్‌కల్యాణ్ గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. దీనిలో భాగంగా రావులపాడు పంచాయతీ పరిధిలోని మల్లాయిదొడ్డిలో రూ.15 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు, అలాగే రావులపాలెంలో రూ.50 లక్షలతో ఓపెన్ జిమ్, డంపింగ్ యార్డు ఆధునికీకరణ, టాయిలెట్లు, షెడ్ల నిర్మాణం, స్థానిక పోలీసు స్టేషన్ పక్కన రూ.20 లక్షలతో నిర్మించనున్న బస్ షెల్టర్, రూ.10 లక్షలతో నిర్మించనున్న రజక కమ్యూనిటీ హాలు, కొమరాజులంకలో రూ.28 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, ఈతకోటలో రూ.23 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేసి శిలాఫకాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



విరబూసిన బ్రహ్మకమలం

ఆత్రేయపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలోని కాశీ అన్నపూర్ణ విశాలక్ష్మి సమేత విశ్వేశ్వరపుత్ర శక్తిగణపతి ఆలయంలో కుండీలలో పెంచుతున్న బ్రహ్మకమలాలు విరబూసాయి. కశ్మీర్‌లో అరుదుగా పూసే ఈ బ్రహ్మకమలాలు ఈ ప్రాంతంలో విరబూస్తున్నాయి. సోమవారం బ్రహ్మకమలాలను భక్తిశ్రద్ధలతో శివునికి అలంకరించారు.

పెళ్లంటే.. బడ్జెట్ ఎంతంట! 6

లక్కు..కిక్కు





లాటరీ తీస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్
హాజరైన దరఖాస్తుదారులు

- జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన మద్యం షాపుల లక్కీడ్రా
- 133 షాపులకు 4,078 మంది దరఖాస్తుదారులు హాజరు
- విజేతలకు ఆనందం.. మిగిలిన వారికి నిరాశ
- విజేతలతో సిండికేట్లు మంతనాలే మంతనాలు
- కలెక్టర్ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో లక్కీడ్రా
- కిటకిటలాడిన కలెక్టరేట్ .. భారీగా ట్రాఫిక్ స్తంభన

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

మద్యం దుకాణాల కేటాయింపునకు సోమవారం జిల్లా కేంద్రమైన అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన లక్కీడ్రా ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో ఆరు ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో 133 మద్యం షాపులకు సంబంధించి 4078 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి వారి సమక్షంలో లక్కీడ్రా తీసి మద్యం షాపుల విజేతలను ఎంపిక చేశారు. పారదర్శకత కోసం ఈ ప్రక్రియనంతా వీడియో కెమెరాలతో చిత్రీకరించారు. వందల మంది సమక్షంలో లక్కీడ్రా నిర్వహించడంతో విజేతల పేర్లు చదివినప్పుడు వ్యాపారుల నుంచి విశేష స్పందన అరుపులు, కేకలతో గోదావరి భవన్ దద్దరిల్లిపోయింది. మహిళలు కూడా మద్యం షాపుల కోసం దరఖాస్తులు చేయడంతో వారు కూడా అతి తక్కువ మంది హాజరయ్యారు. ఉదయం 8 గంటలకు మద్యం షాపుల లక్కీడ్రా కలెక్టర్, ఎక్సైజ్ అధికారుల సమక్షంలో ప్రారంభమైంది ఐదు గంటల పాటు నిర్విరామంగా కొనసాగింది. మధ్యాహ్నం 1 గంట సమయానికి 133 షాపులకు సంబంధించి లక్కీడిప్ పూర్తయింది. కలెక్టర్ కార్యాలయ పరిసర ప్రాంతాల్లో వందల సంఖ్యలో కార్లు, వేల మంది వ్యాపారులతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది. భారీగా ట్రాఫిక్ సైతం స్తంభించిపోవడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి క్లియరెన్సు చేశారు. నల్లవంతెన వద్ద కూడా భారీగా ట్రాఫిక్ స్తంభించింది.

కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీడిప్ ప్రక్రియ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని 133 మద్యం షాపులకు సోమవారం కలెక్టర్ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఉన్న గోదావరి భవన్‌లో లక్కీడిప్ నిర్వహించారు. కలెక్టర్, డీఆర్వోల ఆధ్వర్యంలో రెండు కౌంటర్లు ఏర్పాటు చేశారు. కౌంటర్ నంబరు-1లో అమలాపురం, కొత్తపేట, ముమ్మిడివరం సర్కిళ్లకు సంబంధించి లక్కీడ్రా నిర్వహించగా, కౌంటర్ నంబరు-2లో రాజోలు, రామచంద్రపురం, ఆలమూరు సర్కిళ్లకు డ్రా ప్రక్రియ నిర్వహించారు. ఎంపికైన విజేతలు సంభ్రమాశ్చర్యాల్లో మునిగి తేలగా ఆ షాపు కోసం పోటీపడ్డ మిగిలిన దరఖాస్తుదారుల్లో తీవ్రమైన నిరుత్సాహం నెలకొంది. ప్రతీ డ్రా జరిగే సమయంలో హాలులో కేరింతలతో హోరెత్తిపోయింది. రెవెన్యూ, ఎక్సైజ్ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఐదు గంటల వ్యవధిలోనే 133 షాపుల లక్కీడిప్‌ను ప్రశాంతంగా ముగించారు. నూతన మద్యం షాపుల విధాన ప్రక్రియలో భాగంగా 2024-26 సంవత్సరానికి సంబంధించి లక్కీడ్రా ప్రక్రియ దరఖాస్తుదారుల సమక్షంలో అత్యంత పారదర్శకంగా పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ చెప్పారు. మహిళల పేర్లు దరఖాస్తుదారుల్లో ఉన్నప్పటికీ లక్కీడిప్‌కు హాజరైన వారి సంఖ్య తక్కువగా ఉంది. ఐదు మద్యం షాపులను మహిళలు లక్కీడ్రాలో దక్కించుకున్నారు. గోదావరి భవన్ హాలు దరఖాస్తుదారులతో కిక్కిరిసిపోయింది. బయట కూడా భారీగా వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేసి వందల సంఖ్యలో కుర్చీలు వేయడంతో ఆ ప్రాంగణాలన్నీ దరఖాస్తుదారులతో కిటకిటలాడాయి. లక్కీడిప్ నిర్వహణలో కలెక్టర్, డీఆర్వోలతో పాటు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్, ఇతర ఎక్సైజ్, పోలీసుశాఖ అధికారులు పాల్గొన్నారు.

సిండికేట్ల బేరసారాలు

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మద్యం షాపులకు లక్కీడ్రాలో విజేతలతో బయట ఉన్న మిగిలిన దరఖాస్తుదారులు బేరసారాలు ఆడడం కనిపించింది. విజేతలను కలిసి సిండికేట్లు చేయాలంటూ కొందరు మద్యం వ్యాపారంలో ఆరితేరిన వ్యక్తులు సిండికేట్ల రూపకల్పనకు కృషి చేశారు. రాజోలు ప్రాంతంలో 320 డీడీలు తీసిన కొందరికి ఎనిమిది షాపులు లక్కీడిప్‌లో వచ్చినట్టు తెలిసింది. రూ.కోటి మేర డీడీలు తీసిన వారికి ఒక్క షాపు కూడా తగలకపోవడంతో నిరుత్సాహానికి గురయ్యారు. కొత్తపేట నియోజకవర్గంలో 390 షాపులు డీడీలు తీసిన వారికి 11 మద్యం షాపులు లభించినట్టు సమాచారం. ఇలా విజేతలను కలిసి ఆయా షాపుల్లో పెట్టుబడులు పెట్టేందుకు వ్యాపారులు మంతనాలు సాగించడం కనిపించింది. మధ్యాహ్నం నుంచి విజేతలైన వారు మిగిలిన ప్రక్రియను నడిపేందుకు ఎక్సైజ్, కలెక్టర్ కార్యాలయాల వద్దకు చేరుకుని ఆ ప్రక్రియలో నిమగ్నమయ్యారు.



కలెక్టరేట్ బయట..

కిక్కిరిసిన కలెక్టరేట్

మద్యం వ్యాపారులతో నల్లవంతెన దిగువన ఉన్న కలెక్టర్ కార్యాలయ ప్రాంగణం కిటకిటలాడింది. వందల సంఖ్యలో కార్లు రహదారులకు ఇరువైపులా బారులు తీరాయి. వేల సంఖ్యలో వ్యాపారులు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. దీంతో నల్లవంతెన నుంచి ముక్తేశ్వరం వెళ్లే ప్రధాన రహదారిపై తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు నెలకొన్నాయి. పోలీసులు జోక్యం చేసుకుని సకాలంలో ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మధ్యాహ్నం 1 గంట వరకు కలెక్టరేట్ ప్రాంగణం మద్యం వ్యాపారులతో కిటకిటలాడిపోయింది. లక్కీడ్రా ముగియడంతో ఆ ప్రాంతమంతా ఖాళీ అయింది. నల్లవంతెన వద్ద ఉదయం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ జామ్‌లు కొనసాగుతూనే ఉన్నాయి.

ఆక్రమణలే.. అసలు సమస్య



ఎన్.కొత్తపల్లిలో పఠ్ర ప్రాంతం

- ముంపునీటిని అడ్డుకుంటున్న ఆక్రమణలు
- వేలాది ఎకరాల పఠ్ర దర్జాగా కబ్జా
- సీఆర్‌జడ్ పరిధిని అతిక్రమించి ఆక్వా సాగు
- పఠ్ర ఆక్రమణలపై పలు మార్లు ఆందోళనలు
- ఎంతో ఆర్భాటంగా సర్వేలు
- వెలుగు చూడని సర్వే నివేదికలు
- ఆక్రమణలు తొలగించాలని రైతు సంఘాల డిమాండ్

ఉప్పలగుప్తం, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): కోనసీమలోని పలు మండలాల్లో వరి పంట నీటి పాలవ్వడానికి పఠ్రభూముల ఆక్రమణలే కారణమా?? పఠ్ర కబ్జా వల్లే సముద్రం మొగ మూసుకుపోతోందా?? రైతులు, మత్స్యకారులు అది వాస్తవమేనని వాదిస్తున్నారు. వ్యర్థ జలాలను ఎప్పటికప్పుడు బయటకు పంపేందుకు డ్రెయిన్ల వ్యవస్థ ఏర్పాటు చేశారు. డ్రెయిన్ల ద్వారా కలుషిత జలాలను సముద్రం తనలో కలుపుకుంటుంది. సాగర మార్గానికి సమాంతరంగా ఉన్న పఠ్ర మురుగునీటిని తనలో ఇముడ్చుకుంటుంది. ఇలా ముంపు, మురుగునీరు బయటకు పోవడానికి 1857లో ఇంజనీరింగు నిపుణులు ప్రత్యేక రూపకల్పన చేశారు. అప్పట్లో పఠ్ర, డ్రెయిన్ల లోతులు నిర్ధారించారు. ఆక్రమణలకు కాదేదీ అనర్హం అన్నట్టు కొందరు పఠ్ర భూములను కబ్జా చేశారు. దీంతో మురుగునీరు బయటకు దిగేందుకు అడ్డుకట్ట పడింది. ఫలితంగా పంట పొలాలు ఏటా ముంపు ముప్పుతో ధ్వంసమవుతున్నాయి. ముంపు సమయంలో రైతులు ఆందోళన చెయ్యడం, అధికారులు తాత్కాలిక ఉపశమన చర్యలు తీసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దీని వల్ల ముంపు కష్టాలు తీరగపోగా, ప్రభుత్వ ధనం వృథా అవుతోంది.

మూలాలను వదిలి..



చర్చిస్తున్న ఎమ్మెల్యే

ఉప్పలగుప్తం మండలంలో ఏటా సార్వా నాశనమవ్వడానికి కారణం ముంపునీరే. ఈ ఏడాది ఈ సమస్య రెట్టింపయ్యింది. సుమారు ఆరు మండలాల డ్రెయిన్ల ద్వారా ముంపునీరు మండలంలోని కూనవరం మేజర్ డ్రెయిన్ ద్వారా పఠ్ర, సముద్రంలోకి ప్రవహిస్తుంది. గత కొన్నేళ్లుగా ముంపునీటిని అటు పఠ్ర, ఇటు సముద్రంలోకి సకాలంలో ప్రవహించకపోవడంతో వరుస పంట నష్టాలు సంభవిస్తున్నాయి. రైతులు ప్రజాప్రతినిధులపై వత్తిడి తేవడం ద్వారా అధికారులు తాత్కాలికంగా ముంపునీరు దిగే ఏర్పాట్లు చేస్తున్నారు. అసలు సమస్యను పరిష్కరించాలంటూ ఇటీవల రైతు సంఘాలు జిల్లా కలెక్టర్‌ను కోరారు. వాసాలతిప్ప, ఎస్.యానాం, ఎన్.కొత్తపల్లి పఠ్ర ఆక్రమణలకు లోనయ్యిందని వివరించారు. వేల ఎకరాల విస్తీర్ణంలోని పఠ్ర ఏ మేరకు కబ్జాదారుల గుప్పెట్లోకి వెళ్లిందో లెక్కలు చెప్పారు.

నిబంధనల అతిక్రమణ

వాసాలతిప్ప నుంచి ఎన్.కొత్తపల్లి వరకు సుమారు 3 వేల ఎకరాల పఠ్ర విస్తీర్ణం ప్రస్తుతం సగానికి తగ్గిందన్నది రైతు సంఘాల వాదన. ఆక్రమణదారులు మేజర్ డ్రెయిన్ గట్లను ఆనుకుని ఆక్వా చెరువులు ఏర్పాటు చేసుకున్నారు. సీఆర్‌జడ్ నిబంధనలను బేఖాతర్ చేశారు. టైడల్ బ్యాంక్‌లు సైతం అదృశ్యమైపోయాయి. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఎన్.కొత్తపల్లిలో సర్వే నెంబర్లు 673 టు 682, 689 టు 704, 712 టు 750, 760 టు 787 ఆక్రమణలో ఉన్నాయి. ఎస్.యానాంకి విషయానికి వస్తే సర్వే నెం. 356/2 లో 391, 383, 393, 386, 291 టు298 ఆక్రమణలో ఉన్నాయి. 356/2 లో 1052 ఎకరాలుండగా ప్రస్తుతం మూడు వందలకు పరిమితమైనట్టు స్థానికులే చెబుతున్నారు. ఈ మొత్తం పఠ్రలో మత్స్యకారులు చేపల వేటాడుకుని ఉపాధి పొందేవారు. క్రమంగా పఠ్ర చిక్కిపోవడంతో ముంపునీరు దిగేందుకు మార్గం లేక రైతులు, ఉపాధి లేక మత్స్యకారులు ఇక్కట్లు పడుతున్నారు. పదిహేనేళ్ల క్రితం ఎన్.కొత్తపల్లి మత్స్యకారులు పఠ్ర ఆక్రమణలపై ఆందోళనకు దిగడంతో జిల్లాలోని అందరు సర్వేయర్లతో ప్రత్యేక సర్వే నిర్వహించి, ఆక్రమణలున్నట్టు తేల్చారు. ఎస్.యానాంలో సైతం పఠ్రభూముల పట్టాల పరిశీలన జరిగింది. అయితే కబ్జాదారుల జాబితాలో ప్రముఖ ప్రజాప్రతినిధులుండటంతో సర్వే నివేదికలు వెలుగు చూడలేదు. ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా ఉండటంతో ఎగువ నుంచి ముంపునీరు అధిక పరిమాణంలో కూనవరం డ్రెయిన్‌లోకి చేరి, పఠ్ర ఆక్రమణల కారణంగా బయటకు పోనందున రైతులు ఆక్రమణలపై గొంతెత్తుతున్నారు. ఇటీవల ఎస్.యానాంలో తెలుగు రైతు మండల అధ్యక్షుడు పెమ్మిరెడ్డి సత్యనారాయణ ఆక్రమణల తొలగించాలంటూ కలెక్టర్ మహేష్‌కుమార్‌ను కోరారు. కోనసీమ రైతు పరిరక్షణసమితి చాలా కాలంగా ఈ అంశంపై పోరాడుతోంది. ఈ అంశాన్ని స్థానిక ఎమ్మెల్యేకు వివరించడంతో ఆయన ఆక్రమణలపై దృష్టి సారించారు. గత చాలా ఏళ్లుగా ఉప్పలగుప్తం, అల్లవరం, అమలాపురం రూరల్ మండలాల్లో సార్వా సాగు పూర్తి స్థాయిలో జరగడం లేదు. ముంపునీరు దిగే పఠ్ర ఆక్రమణకు గురవ్వడం, సముద్రం మొగ మూసుకుపోవడం దీనికి కారణం. ఈ ఏడాది రైతులు ఎంతో ఆశతో సార్వా సాగుచేసి ముంపుతో నష్టపోయారు. అందుకే పఠ్ర ఆక్రమణలు తొలగించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పఠ్రను ఆక్రమణల చెర నుంచి విడిపించాలి

అసలు సమస్యను గాలికొదిలేసి, తాత్కాలిక చర్యలతో ఊపిరి పీల్చుకోవడం రైతులకు అలవాటుగా మారింది. దురదృష్టవశాత్తూ పఠ్ర భూములను కొందరు ఆక్రమించుకున్నారు. ఆక్రమణలకు పట్టాలు సృష్టించుకున్నారు. ఆక్రమణల జోలికెళ్తే కొందరు ప్రముఖుల గుట్టు రట్టవుతుంది. అందరికీ న్యాయం జరగాలంటే పఠ్రను ఆక్రమణల చెర నుంచి విడిపించాలి. వేలాది ఎకరాల వరి పంట రైతులకు దక్కాలంటే ఈ చర్య తప్పనిసరి. ● ఎమ్మెల్యే ఆనందరావు



స్థల పరిశీలన చేస్తున్న డిప్యూటీ కమిషనర్


సొంత పార్కింగ్

ప్రహరీ నిర్మాణానికి పలు సూచనలు
పార్కింగ్ స్థలాన్ని పరిశీలించిన అధికారులు

ఆత్రేయపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలోని 6.82 ఎకరాలలో సొంత పార్కింగ్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలించి ప్రహరీ నిర్మాణానికి ఇంజనీరింగ్, కాంట్రాక్టర్‌తో పర్యవేక్షణ చేసి సూచనలు అందచేశారు. పార్కింగ్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం ద్వారా భక్తులు ట్రాఫిక్ కష్టాలు తొలగనున్నాయి. అనంతరం ఆలయంలో పర్యటించి భక్తుల క్యూలైన్లు మార్పులు, చేర్పులకు ఆదేశాలు జారీ చేశారు. లడ్డూ తయారీ, అన్నదాన ప్రదేశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

అవయవ మార్పిడి వైద్య సేవలు

అంబాజీపేట,అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అమలాపురం కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో అవయవ మార్పిడి వైద్య సేవలతో పాటు కేన్సర్ ఆసుపత్రిని రూ.50 కోట్లతో ప్రారంభిస్తున్నట్టు కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు, ఎండీ కె.రవివర్మ తెలిపారు. అంబాజీపేటలో ఏర్పాటు చేసిన మెడ్ యునైటెడ్ ఆసుపత్రిని పి.గన్నవరం, అమలాపురం ఎమ్మెల్యేలు గిడ్డి సత్యనారాయణ, అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. ప్రస్తుతం అంబాజీపేట, మలికిపురం మండలాల్లో ఈ ఆసుపత్రిని ప్రారంభించామని, గ్రామీణ ప్రాంతాల రోగులకు వైద్య సేవలు అందించే విదంగా ఈ ఆస్పత్రులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, సర్పంచ్‌లు నాగాబత్తుల శాంతికుమారి, మాజీ ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావు, నాయకులు నామన రాంబాబు, పీకే రావు, గణపతి వీరరాఘవులు, బొంతు పెదబాబు తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

ఎస్పీ గ్రీవెన్స్‌కు 14 అర్జీలు


అమలాపురం టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ మండలాల నుంచి వచ్చినవారు 14 అర్జీలను ఎస్పీకి అందజేసి తమ గోడును విన్నవించారు. సంబంధిత కేసులను ఆయా పోలీసుస్టేషన్ల ఎస్ఐలకు, సీఐలకు పంపించారు. చట్టానికి లోబడి సమస్యలను పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు.

మంత్రి సుభాష్ పూజలు



అమలాపురం టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం బండారులంక భువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన మంత్రికి తొలుత శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అభిషేకాల అనంతరం పురోహితులు వేదాశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్, సర్పంచ్ పెనుమాల సునీత, నాయకులు చింతా అత్తిలింగం, పిచ్చిక వెంకన్న, కాశిన బాబి, బొక్కా పార్థసారథి, గుత్తుల సురేష్, బొంతు శ్రీను, గుత్తుల డీఆర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిద్ధిధాత్రిగా దర్శనం



అమలాపురం టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా అమలాపురం శ్రీదేవి మార్కెట్ సెంటర్‌లోని శ్రీదేవి అమ్మవారిని శ్రీసిద్ధిధాత్రిగా విశేష అలంకారం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దండుమేను సూర్యనారాయణ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు.



ఉప్పాడ తీరంలో మత్స్యకారుని వలకు పెద్ద మండ పీత చిక్కింది. కిలో బరువున్న మండపీతను రూ.900కు తీరప్రాంతానికి చెందిన వ్యక్తే కొనుగోలు చేయడం విశేషం. - కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి)



లిక్కర్ దుకాణాల డ్రాలో ఈసారి మహిళలు ఎక్కువగానే పాల్గొన్నారని తేలింది. చివరకు డ్రాలో గెలిచిన వారిలోనూ తామేమీ తక్కువ కాదన్నట్టు షాపులు దక్కించుకున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 16 మంది మహిళలు మద్యం షాపులు దక్కించుకోగా, కాకినాడ జిల్లాలో ఆరుగురు దక్కించుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమలో ఐదు షాపులు దక్కించుకున్నారు.



పెళ్లంటే.. బడ్జెట్ ఎంతంటే!

పెళ్లంటే ఇది వరకు ఉన్న సంప్రదాయం వేరు. ఇప్పుడు వేరు. పూర్వం ఐదు రోజుల పెళ్లిళ్లు జరిగేవని పెద్దలు చెబుతుంటే వినేవాళ్లం. తర్వాత ఒక రోజు పెళ్లి తంతు వరకూ వచ్చేసింది. కానీ ఇప్పుడు మళ్లీ ట్రెండ్ మారింది. పెళ్లి పేరుతో ఐదు రోజులేంటి. డబ్బుంటే వారం రోజులూ ఒకటే హడావుడే. సామాన్య కుటుంబాలు సైతం లక్షల్లో వివాహ వేడుకల కోసం ఖర్చు పెట్టేస్తున్నారు. మధ్యతరగతి వారు ఉన్నత వర్గాలతో పోటీపడుతున్నారు. ధనవంతులైతే ఓ చిన్న సినిమా బడ్జెట్‌తో సమానంగా ఖర్చు చేస్తున్నారు. పెళ్లి పిలుపుల నుంచి వివాహ వేదికల వరకు, ప్రీ వెడ్డింగ్ షూట్ల దగ్గర మొదలైన సందడి ముహూర్తం రోజు దాకా ఒక్క తంతు కాదు జరిగేది.. సంగీత్, మెహందీ, బ్యాచిలర్ పార్టీల దాకా వేల నుంచి లక్షల దాకా ఖర్చే ఖర్చు. ఇక వివాహం రోజు.. వివాహ వేదిక, విద్యుత్, పూల అలంకరణలు, విందు భోజనాలు, అతిథుల బస, రిటన్ గిఫ్టల పేరుతో చేసే వ్యయం పెళ్లి బడ్జెట్‌ను అంచనాలకు మించిపోతోంది. మా పిల్లల పెళ్లి.. ఆడంబరంగా చేసుకోకపోతే ఎలా అని కొందరు సంబరపడుతుంటే, వివాహ తంతు పూర్తయ్యాక బడ్జెట్ లెక్కలేసుకుని లబోదిబోముంటున్న వారెందరో.. అందుకే పెళ్లంటే.. బడ్జెట్ ఎంతంటున్నారు ప్రతి ఒక్కరూ.. మరి మీ బడ్జెట్ ఎంతేంటి..

- మొదలైన పెళ్లిళ్ల సందడి.. ఈ మూడు నెలలూ ముహూర్తాల పంట.. అన్ని వ్యాపారాలకూ జోష్
- వివాహాల పేరిట లక్షల్లో వ్యయం.. పరపతి చాటుకునే వివాహ వేడుకలు.. విందు భోజనాలు
- రంగంలోకి మ్యారేజ్ ఈవెంట్ మేనేజ్‌మెంట్లు.. సొమ్ములిస్తే చాలు అన్నీ సిద్ధం చేసేస్తామంటూ రెడీ



పెళ్లిళ్లే.. పెళ్లిళ్లు..

పచ్చని పందిళ్లు.. విద్యుత్ దీపాలంకరణలతో ఏ వీధికి వెళ్లినా పెళ్లి సందడే. వరుసగా మూడు నెలలపాటు పెళ్లి ముహూర్తాలు రావడంతో ఓవైపు పురోహితులు, మరోవైపు ఫొటో, వీడియోగ్రాఫర్లు, కేటరింగ్ పనివారలకు చేతినిండా పనే. ఏ ఇంట చూసినా ఇప్పటికే నాలుగైదు శుభలేఖలు పెళ్లిళ్లకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాయి. పెళ్లిళ్ల సీజన్ జోరందుకోవడంతో ఓవైపు బంగారు నగల వ్యాపారం మరోవైపు వస్త్ర వ్యాపారాలతోపాటు అనుబంధ వ్యాపారాలు ఊపందుకున్నాయి. కల్యాణ మండపాలకు యమ డిమాండు ఏర్పడింది. ముహూర్తాలు పెట్టుకున్న సమయంలోనే ముందుగా కల్యాణ మండపాలను బుక్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మూడు నెలలపాటు ఉన్న పెళ్లి ముహూర్తాల గురించి బండారులంకకు చెందిన ఈశ్వర పంచాంగకర్త కాలెపు భీమేశ్వర రావు సిద్ధాంతి వివరించారు. ప్రస్తుత ఆశ్వయుజ మాసమైన అక్టోబరులో ఈ నెల 16న సాయంత్రం 6.52 గంటలకు, రాత్రి 12.06 గంటలకు, 17న రాత్రి 8.16 గంటలకు, 20న రాత్రి 10.54 గంటలు, 26న రాత్రి 10.30 గంటలకు, 27న ఉదయం 7.58 గంటలకు పెళ్లి ముహూర్తాలు ఉన్నాయి. నవంబరు 2వ తేదీ నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు కార్తీకమాసం. నవంబరు 3వ తేదీ రాత్రి 7.08 గంటలకు, 9.58 గంటలకు, 6న ఉదయం 7.18 గంటలు, 9న రాత్రి 6.45 గంటలకు, 10న ఉదయం 7.03 గంటలకు, 13న ఉదయం 6.52 గంటలకు, 14వ తేదీ ఉదయం 6.48 గంటలకు, రాత్రి 6.26 గంటలకు, 22న రాత్రి 8.44 గంటలకు, తెల్లవారుజామున 5.20 గంటలకు పెళ్లి ముహూర్తాలున్నాయి. డిసెంబరు 2 నుంచి 30వ తేదీ వరకు మార్గశిరమాసమని, డిసెంబరు 4న రాత్రి 7.57 గంటలు, 5న తెల్లవారుజామున 4.29 గంటలకు, 6న తెల్లవారుజామున 4.25 గంటలకు, 7న రాత్రి 7.45 గంటలకు, తెల్లవారుజామున 4.21గంటలకు, 10న తెల్లవారుజామున 4.09 గంటలకు, 11న తెల్లవారుజామున 4.06 గంటలకు, 20న రాత్రి 3.31 గంటలకు, 25న తెల్లవారుజామున 4.08 గంటలకు పెళ్లి ముహూర్తాలు ఉన్నట్టు భీమేశ్వరరావు సిద్ధాంతి తెలిపారు.

- అమలాపురం రూరల్ (ఆంధ్రజ్యోతి)



పూల పందిరిలో...

మీరు నిండు మనస్సుతో వచ్చి మూడుముళ్ల బంధంతో పచ్చని పందిరిలో ఒకటి కాబోతున్న జంటకు మీ చల్లని చేతులతో అక్షింతలు వేసి దీవించి మనసారా ఆశీర్వదించండి... ఒకప్పుడు శుభలేఖలో అతిథులకు పలికే స్వాగత పలుకులు ఇలా ఉండేవి.. ఆరోజు వచ్చిన బంధుమిత్రులకు ఎదురేగి స్వాగతం పలికి పచ్చని పందిట్లో మేళతాళాల మధ్య వేద మంత్రాల సాక్షిగా ఒక్కటయ్యే నవ దంపతులకు ఆశీర్వచనాలు పొందడం, అరిటాకులో విందు భోజనం ఆరగించి వీడ్కోలు తీసుకోవడం జరిగేది. ఇప్పుడు పెళ్లంటే.. సాదాసీదా కాదు, పచ్చని పందిట్లో సందడిగా సాగిపోయే తంతు కాదు.. ఎంత చెట్టుకు అంత గాలి అన్నట్టు హోదాకు తగినట్టు, తమ స్తోమతను చాటుకునేలా అంగరంగ వైభవంగా వివాహాలు జరిగిపోతున్నాయి. వేలల్లో ఖర్చుతో జరిగే పెళ్లిళ్లు లక్షల్లో వ్యయమవుతున్నాయి. ధనికుల ఇళ్లల్లో అయితే కోట్లలో ఖర్చు పెట్టేస్తున్నారు. ఆహ్వాన పత్రిక మొదలుకొని పెళ్లికి బంగారం, ఖరీదైన పట్టు చీరలు, వచ్చిన అతిథులకు ఆహా ఏమిరుచి అన్నట్టు ఎన్నెన్నో వంటకాలతో విందు భోజనాలు, వివాహానికి ఖరీదైన వేదికలు, అద్భుతమైన సెట్టింగులు, పూలతోటల మాదిరిగా అలంకరణలు... వీటన్నింటిని కెమెరాలో బంధించేలా వీడియో, ఫొటోగ్రఫీ. పెళ్లికి ముందు ప్రీ వెడ్డింగ్ షూట్లు.. ఒక సినిమా తీసినంత అట్టహాసంగా షూటింగ్.. చెప్పాలంటే పెళ్లంటే ఇవాళ ఒక భారీ బడ్జెట్ సినిమా. గతంలో ఐదు రోజుల పెళ్లిళ్లు జరిగేవి. తర్వాత మూడు రోజులకు, తర్వాత ఒక రోజుకి చేరాయి. ఇప్పుడు పెళ్లికి ముందు, తర్వాత కలిపి కనీసం ఐదు రోజులకు తగ్గకుండానే ఒక్కొక్క వివాహానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇది వరకు ఓ మాదిరి పెళ్లంటే ఒక లక్ష లేదా రెండు లక్షల ఖర్చు. ఇప్పుడు సామాన్యులైతే రెండు మూడు లక్షలు.. మధ్యతరగతి అయితే కనీసం పది లక్షలు.. కాస్త కలిగిన వారైతే ఇరవై.. ధనికులైతే రూ.40 లక్షల నుంచి కోటి వరకు అవుతోందని మ్యారేజ్ ఈవెంట్ నిర్వాహకులు చెబుతున్నారు. ఇది వరకు బంధువులే కాస్త ముందు వచ్చి పెళ్లి ఏర్పాట్లు చూసేవారు. ఇప్పుడు మ్యారేజ్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ అంటూ ఒక వ్యవస్థే వచ్చి కూర్చుంది. బడ్జెట్‌ను బట్టి పెళ్లి.. ఎంత ఘనమైతే అంత ధర. దీంతో అబ్బా ఫలానా పెళ్లికి వెళ్లాం.. ఏముందిరా మండపం.. ఏ మున్నాయిరా భోజనాలు.. ఎవరికి ఆర్డర్ ఇచ్చారంటావు? చాలా బాగున్నాయిరా... అని పెళ్లికి వచ్చిన వారి చర్చోపచర్చలు. ఈ కామెంట్ కోసం లక్షలు ఖర్చు పెట్టామని పెళ్లివారూ జబ్బలు చరుచుకోవడం చూస్తూనే ఉన్నాం. కానీ ఈ ఘనమైన పెళ్లిళ్ల సందడిలో మధ్యతరగతి వారూ పరుగులు పెట్టి ఆనక లబోదిబోమనడం కూడా చూస్తున్నాం.

'మహా' విందులు..

వివాహాది శుభకార్యాలకు వధూవరుల కుటుంబాలు ఏర్పాటుచేస్తున్న విందులు ఆహా.. భోజనంబు అన్న రీతిలో అబ్బురపరుస్తున్నాయి. వివాహం ఎంత డెకొరేటివ్‌గా చేశామన్నది ప్రధానమైతే, ఎంత ఘనంగా భోజనాలు పెట్టామన్నది మరో ముఖ్యమైన విషయమైంది. అసలే గోదావరి జిల్లాలు.. భోజనాల్లో 'స్పెషాలిటీ' ఉండనే ఉంటుంది. దానికి తోడు ఎన్ని వెరైటీలు భోజనం మెనూలో ఉన్నాయనేది ఈమధ్య స్టేటస్‌కు సింబల్‌గా మారింది. దానికోసం ఖర్చుకు వెనుకాడడం లేదు. విందు భోజనాల్లో పది నుంచి 20 రకాలపైబడి ఆహార పదార్థాలు విస్తరిలో వడ్డిస్తారు. విజిటేబుల్ బిర్యాని, ఫ్రైడ్‌రైజ్, జీరా రైస్, వాము రైస్, కొరియాండర్ రైస్, టమాటోరైస్, లెమన్ రైస్, కోకోనట్ రైస్, పులిహోరా, వైట్ రైస్ మొదలెడితే అర డజను రకాల కూరలు, ఫ్రై, రసం, సాంబారు, పులుసులు ఇలా ఓ పది అయిటమ్స్ అన్నా వేసేస్తున్నారు. స్వీట్లు, ఐస్ క్రీమ్స్, పాన్‌లు వంటివి ప్రత్యేక కౌంటర్‌లే ఏర్పాటుచేస్తున్నారు. స్వీట్లు కూడా పూత రేకులు మొదలుకొని తాపేశ్వరం కాజా వరకు సుమారు ఐదు నుంచి పాతిక రకాల స్వీట్లను అందుబాటులో ఉంచుతున్నారు. భోజనాలతోపాటు అల్పాహారాలను సైతం అందుబాటులో ఉంచుతున్నారు. మినపరొట్టెలు, పొట్టిక్కలు, చిట్టి గారెలు, ఇండ్లీ సాంబరు, ఉప్మా పెసరట్టు, మినీ పూరీలు, ఉల్లిబజ్జిలు అవో డజను రకాలు.. వేడివేడిగా తయారుచేసి వడ్డించే ఏర్పాట్లు చేస్తున్నారు. విందు భోజనాలకు లక్ష నుంచి మూడు లక్షలు వరకు సామాన్య, మధ్యతరగతి వారు, ఉన్నత వర్గాల వారు పాతిక లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. క్యాటరింగ్ సంస్థలు ప్లేటుకు రూ.300 నుంచి రూ.2 వేల దాకా విందు భోజనాలకు చార్జి చేస్తున్నారంటే భోజన బడ్జెట్ ఎంతో మీరే లెక్కలేసుకోండి.

- రాజమహేంద్రవరం సిటీ (ఆంధ్రజ్యోతి)



మండపం ఖర్చు 10 లక్షల దాకా..

పెళ్లి మండపం ఖర్చు అక్షరాలా 10 లక్షలు పైమాటే అంటే ఆశ్చర్యపోతున్నారా.. ఇది నిజం. ఖరీదైన ఇలాంటి మండపం తయారీకి పూలు ఊటీ, కేరళ ప్రాంతాల నుంచి తీసుకొస్తారు. ఈ మండపాన్ని పెళ్లికి 4 నుంచి 6 రోజుల ముందు నుంచే తయారుచేయడంలో పూలడెకరేటర్లు నిమగ్నమై ఉంటారు. ఇందుకు బెంగళూరు నుంచి కార్నిషియా, ఆర్కిడ్స్, విలియమ్స్, హెల్కోనియా, బ్లూడైజ్, సాంగ్ ఆఫ్ ఇండియా, డ్రసేనియా, క్రిసాంతిమం, స్నోబాల్ తదితర ఖరీదైన అందమైన పూలను తీసుకువస్తారు. వివాహానికి హాజరయ్యే బంధువులు వచ్చే కల్యాణమండపం ద్వారం నుంచి పూలతో అలంకరణ మొదలవుతుంది. ప్రస్తుతం పెళ్లికుమార్తె మంగళ స్నానంతో ఇచ్చే పూల నుంచి పెళ్లి మండపం, మొదటిరాత్రి గది అలంకరణ వరకు మొత్తం పూలు, మండపం వరకు తామే అలంకరణ చేసే విధంగా ఆర్డర్లు వస్తున్నాయని డెకరేటర్లు చెబుతున్నారు. వేదికను బట్టి యాభై వేల నుంచి పదిహేను లక్షల దాకా పూల డెకరేషన్ ఖర్చు అవుతుందని చెబుతున్నారు. - కడియం (ఆంధ్రజ్యోతి)



పెళ్లంటే తప్పెట్లు తాళాలు కాదు.. వీడియో షూట్లు.. ఫొటో సెషన్స్

పెళ్లిళ్ల అనగానే వేద మంత్రాలు, బాజాభజంత్రీలతో చేసే సందడి ఒక్కటే కనిపించేది.. ఇప్పుడు పెళ్లి అంటే పూర్తిగా ఫొటో, వీడియో షూట్లు. అదృష్టం బాగుంటే అప్పుడప్పుడూ పెళ్లి సందడి మనకు కనిపిస్తే వీక్షించి ఆనందించొచ్చు. జీలకర్ర బెల్లం వేళో, సూత్రధారణ సమయంలోనో నాలుగు అక్షితలు వేయడానికి క్యూ లైన్లలో నుంచి వధూవరుల వద్దకు వెళ్లినా పక్కకు జరగండనో, ఫొటోకు ఫోజువ్వమనో ఆర్డర్లు వినిపిస్తాయి. పెళ్లి జీవితంలో మరుపురాని మధురానుభూతి. దాన్ని పదికాలాలు దాచుకునేలా ఫొటోలు, వీడియోలు తీయించుకోవడమూ సబబే. కానీ పెళ్లికి ముందు ప్రివెడ్డింగ్ షూట్లు, మెగా ఈవెంట్ మాదిరి పెళ్లి వేడుకల రికార్డింగ్ హడావుడి మధ్య పెళ్లి తంతు ముగుస్తోంది. దీనికి కూడా లక్ష నుంచి పది లక్షలపైనే వసూలు చేసే ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలు, ఫొటోగ్రాఫర్లు ఉన్నారంటే ఆశ్చర్యపోనవసరం లేదు.

డాగ్ 'షో'

కుమార్తెకు ప్రేమతో..

చైనా నుంచి

కాకినాడకు..

సింహాన్ని

తలపిస్తున్న చౌచౌ

విశ్వాసానికి మారుపేరుగా శునకాలు నిలుస్తాయి. పలువురు వారి ఆర్థిక పరిస్థితులను బట్టి లక్షలు వెచ్చించి శునకాలను దేశ విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటూ ఇళ్లల్లో పెంచుకుంటున్నారు. కాకినాడకు చెందిన మాజీ కార్పొరేటర్ కొరుమిల్లి బాలప్రసాద్ లక్షలు విలువ చేసే జాగిలాన్ని చైనా నుంచి కొనుగోలు చేసి తన కుమార్తెకు బహుమతిగా అందించారు. చూసేందుకు సింహాన్ని తలపిస్తున్న ఈ జాగిలం చౌచౌగా పిలిచే చైనాకు చెందింది. గంభీరంగా కనిపిస్తున్న వీటి ధర కూడా అదే స్థాయిలో లక్షల్లో ఉంటుంది. ఇంటి కాపలాలో దీనికి ఇదే సాటి. 8 నుంచి 12 ఏళ్ల జీవితకాలం ఉన్న ఈ జాతి శునకాలు చలి ప్రదేశాల్లో ఎక్కువగా జీవిస్తాయి. వీటి నాలుక నీలి రంగులో ఉంటుంది. అయిదేళ్ల కిందట తన కుమార్తె పదో తరగతి పాసైనందుకు గిఫ్ట్‌గా ఇచ్చేందుకు బెంగుళూరు, ఢిల్లీ నుంచి రూ.2.40 లక్షలు వెచ్చించి రెండు శునకాలు కొనుగోలు చేశారు. ఇవి చూడ్డానికి సింహాల్లా ఉండడం విశేషం.







- కాకినాడ కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

నేడు గ్రామీణ మహిళా దినోత్సవం..





దుమ్మిరి భీమమ్మ రచించిన కోయ పద్యం కిల్లోర్‌కె.. కోయబాల సాహిత్య రచయిత్రి దుమ్మిరి భీమమ్మ

నాటి నిరక్షరాస్యురాలే.. నేటి రచయిత్రి!

స్ఫూర్తిగా నిలిచిన ఆదివాసీ మహిళ దుమ్మిరి భీమమ్మ

భావితరాలకు కోయబాల' సాహిత్యం

అదే ఆమె లక్ష్యం

దుమ్మిరి భీమమ్మ... ఓ ఆదివాసీ మహిళ. ఎనిమిది మంది సంతానంలో ఆరవది. ఇపుడామె వయసు 51 ఏళ్లు. సాధారణ వ్యవసాయ కుటుంబంలో పుట్టి పెరిగిన భీమమ్మను చదివించే ఉద్దేశం తల్లిదండ్రులకు లేదు. అంటే అంతటి స్తోమత లేదన్నమాట. అయితే తమ్ముడు బడికి వెళ్లనంటూ మారాం చేస్తుండడంతో తమ్ముడికి తోడుగా భీమమ్మను తల్లిదండ్రులు బడికి పంపించేవారు. అట్లా భీమమ్మ తన తమ్ముడితోపాటే ఐదో తరగతి వరకు చదువుకుంది. ఆ తర్వాత తమ్ముడు బడికి సవ్యంగా వెళ్లడం అలవాటుపడ్డాడు. దీంతో భీమమ్మను ఆమె తల్లిదండ్రులు ఇంటి పనులకే పరిమితం చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం రామన్నపాలేనికి చెందిన భీమమ్మ తనకు చదువుపై ఆసక్తి ఉన్నా చేసేదేమీ లేక మిన్నకుండిపోయింది. చివరకు వ్యవసాయ పనుల్లో భాగమైంది.

● ఇరవై మూడేళ్లకు మళ్లీ చదువు

హైదరాబాద్‌కు చెందిన ఓ ఎన్జీవో సంస్థ చింతూరు మండలం చట్టిలో చదువురాని యువతీ, యువకులను సమీకరించి వారితో ఏడో తరగతి పరీక్షలు రాయించడం మొదలుపెట్టింది. వారందరికీ భోజన వసతి కూడా కల్పించారు. విషయం తెలుసుకున్న భీమమ్మ వారిని ఆశ్రయించింది. ఈ క్రమంలో ఆమె ఏడో తరగతి పాసైంది. తోటి వారంతా పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతామని ఎన్జీవో నిర్వాహకులకు చెప్పుకున్నారు. అయితే తమ ప్రాజెక్టు పూర్తయిందని వారు నిష్క్రమించారు. దీంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది.

● సొంతంగా ఆశ్రమ పాఠశాల

ఎన్జీవో తరఫున అప్పటివరకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు గంగదేవి యాదయ్య, పాండు కాంబ్లేకర్.. భీమమ్మలాంటి పలువురు విద్యార్థుల తపన చూసి ఏదో చేయాలన్న ఆలోచనకొచ్చారు. భీమమ్మ లాంటివారు 55 మంది పోగయ్యారు. వారంతా కలిసి రామన్నపాలెంలో తలోకొంత సొమ్ము జమ చేసుకుని అటవీ కలపతో ఒక ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేసుకున్నారు. తమకు వేతనాలొద్దంటూ యాదయ్య, పాండు వారితో పాటే ఆశ్రమ పాఠశాలలో ఉంటూ పాఠాలు చెప్పారు. భీమమ్మ పదో తరగతి కూడా పాసైంది. అక్కడితో ఆగని ఆమె ఓపెన్ యూనివర్సిటీ ద్వారా బీఏ పూర్తి చేసింది.



భీమమ్మ రచించిన కోయ పద్యం మిడికోస్

● కోయబాల సాహిత్యంపై మక్కువ

అంచెలంచెలుగా కోయత్తోర్ బాట (ఆదివాసీల దారి) ఎంతోమందికి విద్యాబుద్ధులు నేర్పించింది. అదే దశలో భీమమ్మ సాహిత్యంపై మక్కువ పెంచుకుంది. కాలక్రమంలో తమ ఆదివాసీ భాష కనుమరుగైపోతున్న తీరుని ఆమె పసిగట్టింది. సంప్రదాయాలు, ఆచారాలకు పుట్టినిల్లుగా ఉన్న కోయభాషను ఆదివాసీ భావితరాలకు అందించాలన్న తపన భీమమ్మలో మొదలైంది. దీంతో ఆమె కోయ సాహిత్యంపై దృష్టి సారించింది. అదే తన లక్ష్యంగా మలచుకుంది. అందుకు యాదయ్య, పాండు కూడా సహకారమందించారు. దీంతో కోయబాల సాహిత్యంపై భీమమ్మ అడుగులు వేగంగా పడుతున్నాయి. ఇపుడామె కలం నుంచి పలు కథలు, పద్యాలు, పాఠాలు రూపుదిద్దుకుంటున్నాయి. అవన్నీ కోయ భాషలోనే.

● ప్రతి చప్పుడూ ఓ కథే

ప్రతి జీవరాశి నుంచి వెలువడే శబ్దం ఆమె కోయ బాల సాహిత్యంలో పద్యం, పాటగా రూపుదిద్దుకుంటున్నాయి. కిల్లోర్‌కె, మిడికోస్... ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో గిరిజన సాహిత్య రచనలకు ఆమె శ్రీకారం చుట్టింది. చివరకు మొన్నటి నిరక్షరాస్యురాలు నేడు సాహిత్య రచయితగా పలువురి ప్రశంసలు, మన్ననలు సొంతం చేసుకుంటోంది. - చింతూరు (ఆంధ్రజ్యోతి)



కోయబాల సాహిత్య కార్యశాలలో భీమమ్మను సన్మానిస్తున్న ఆదివాసీ మహిళలు (పాత చిత్రం)

పట్టుదలతో.. పరిశ్రమ

ప్రభుత్వ ప్రోత్సాహంతో

రాణిస్తున్న వివాహిత

ఔత్సాహిక మహిళా

పారిశ్రామికవేత్తగా అడుగులు





రమణయ్యపేట ఇండస్ట్రియల్ ఏరియాలో ప్లాస్టిక్ బాటిల్స్ తయారీ.. పక్కన మండపల్లి ధనలక్ష్మి

కాకినాడ జిల్లాలో ఎంఎస్ఎంఈ ద్వారా లబ్ధిపొందిన పారిశ్రామికవేత్తలు సుమారు 13 వేల మంది ఉన్నారు. ఇందులో మహిళా పారిశ్రామికవేత్తలు 3800 వరకు ఉన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో స్వయం ఉపాధి పొందుతూ పలువురు మహిళలకు జీవనోపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కాకినాడ రూరల్ మండలంలోని రమణయ్యపేట గ్రామం బాపన్నదొర కాలనీకి చెందిన మండపల్లి ధనలక్ష్మి ఇందులో ఒకరు. ఈమె డిగ్రీ పూర్తి చేసి ఎంబీఏ చదువుతున్నారు. ఈమె భర్త నవీన్ డ్రైవర్. ఇద్దరు పిల్లలు. భర్త సంపాదనకు తోడుగా తాను ఉద్యోగం చేసి కుటుంబానికి అండగా నిలవాలని భావించి ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ తయారీలో రెండేళ్లపాటు పనిచేసి ధనలక్ష్మి నైపుణ్యం సాధించింది. సొంతంగా పరిశ్రమ ఏర్పాటుచేయాలన్న ఆలోచనతో జిల్లా పరిశ్రమల శాఖ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద ఉన్న పథకాలపై సమాచారాన్ని సేకరించింది. జిల్లా పరిశ్రమలశాఖ అధికారుల వద్దకెళ్లి సొంతంగా ప్లాస్టిక్ బాట్లింగ్ తయారీ యూనిట్ నెలకొల్పాలన్న ఆకాంక్షను వ్యక్తం చేసింది. 2023లో డీపీఆర్ తయారుచేసి పీఎంఈజీపీ పథకంలో యూనిట్ మంజూరు కోసం దరఖాస్తు చేసుకుంది. యూనిట్ ఖరీదు రూ.35 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో రూ.12 లక్షల రాయితీగా, లబ్ధిదారుని వాటా సొమ్ము 5 శాతం చెల్లించి 2024 ఫిబ్రవరిలో రమణయ్యపేట ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ప్లాస్టిక్ బాట్లింగ్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసింది. పలువురు మహిళలకు జీవనోపాధి కల్పిస్తూ స్వయం ఉపాధి పొందుతూ ఆమె ఇతరులకు మార్గదర్శకంగా నిలిచారు. సొంతంగా పరిశ్రమ ఏర్పాటుచేయాలన్న కోరిక, నైపుణ్యం ఉంటే యూనిట్లు మంజూరుకు పరిశ్రమల శాఖ అధికారులు సిద్ధంగా ఉన్నారని ధనలక్ష్మి తెలిపారు.

- సర్పవరం జంక్షన్(ఆంధ్రజ్యోతి)

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు

కరప విద్యార్థిని యస్మిత నాగమహి ఎంపిక



కరప, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు కాకినాడ జిల్లా కరప విద్యార్థిని ఎంపికైంది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న బి.యస్మిత నాగమహి బాలికల జూనియర్ అండర్-17 కేటగిరీలో నేషనల్ ఖోఖో పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 16 నుంచి తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో జరిగే బాలికల సౌత్‌జోన్ ఖేలో ఇండియా మ్యాచ్‌కు రాష్ట్రం తరపున ఈమె ప్రాతినిధ్యం వహిస్తుందని చెప్పారు. జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటి గ్రామానికి పేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు. యస్మిత నాగమహిని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, పీఏంసీ చైర్మన్ దేవు దుర్గారావు, హెచ్‌ఎం, పీడీలు కె.శ్రీనివాసరావు, బి.చంద్రశేఖర్, సీహెచ్ కృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

కార్తిక మాసం రద్దీ నేపథ్యంలో

రత్నగిరిపై క్యూలైన్లు, వ్రత మండపాల పరిశీలన

అన్నవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నవంబరు 1న ప్రారంభమయ్యే కార్తిక మాసం సందర్భంగా సత్యదేవుడి సన్నిధికి లక్షలాదిగా విచ్చేసే భక్తులకు సౌకర్యాల కల్పన, లోటుపాట్లపై ఈవో రామచంద్రమోహన్ సోమవారం పరిశీలించారు. ముందుగా క్యూ లైన్లు, వ్రత మండపాలను చూశారు. ఒక్కో మండపంలో ఎంతమంది భక్తులు వ్రతమాచరించుకునే వీలుందో ఆరా తీశారు. మండపాల లోపలి భాగంలో ఏర్పాటు చేసిన నూతన క్యూలైన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. రెవెన్యూ, పోలీసు, మిగిలిన శాఖల అధికారులతో త్వరలో సమావేశం నిర్వహించేందుకు మినిట్స్ సిద్ధం చేయాలని సూచించారు.



రాజరాజేశ్వరీదేవిని దర్శించుకుంటున్న కమిషనరు సత్యనారాయణ దంపతులు

పాదగయలో దేవదాయ శాఖ కమిషనరు పూజలు



పిఠాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని దేవదాయ శాఖ కమిషనరు సత్యనారాయణ సతీసమేతంగా సోమవారం సాయంత్రం సందర్శించారు. కుక్కుటేశ్వర స్వామి, దత్తాత్రేయ స్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేదపండితులు క్షేత్రప్రాశస్త్యాన్ని వివరించారు. కమిషనరు దంపతులను దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనరు రమేష్‌బాబు, ఆలయ సూపరింటెండెంట్ వీరభద్రరావు శేష వస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. శిష్టికరణాల వీధిలోని పురుహూతికా అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులను దర్శించుకున్నారు. కమిషనరు దంపతులకు కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.





ధ్వంసమైన సరస్వతీ దేవి విగ్రహం, తొలగించిన దిమ్మ

సరస్వతీ దేవి విగ్రహం ధ్వంసం

లంపకలోవ హైస్కూల్లో దుండగుల దుశ్చర్య

పోలీసులు రంగప్రవేశం... క్లూస్ టీమ్ పరిశీలన... హైందవ సంఘాల ఆగ్రహం

ప్రత్తిపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం లంపకలోవ జడ్పీ హైస్కూలులోని సరస్వతీ దేవి విగ్రహాన్ని ఆదివారం అర్ధరాత్రి దాటాక గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. హైస్కూలు ప్రాంగణంలో దశాబ్దం క్రితం అప్పటి వార్డెన్ ఎం.మధుసూదనరావు సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించగా అప్పటి విద్యా కమిటీ చైర్మన్ సిగిరెడ్డి భక్తాంజనేయ ఆవిష్కరించారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు విగ్రహాన్ని దిమ్మ నుంచి వేరుచేసి దారుణంగా ధ్వంసం చేశారు. దసరా సెలవులు ముగిసి సోమవారం స్కూలు వచ్చిన వెంటనే విగ్రహాన్ని చూసిన వాచ్‌మెన్, ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయుడు కేవీ రాఘవకుమార్ దృష్టికి తీసుకెళ్లారు. హెచ్‌ఎం ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ లక్ష్మీకాంతం, సిబ్బంది వచ్చి పరిశీలించారు. కాకినాడ నుంచి వచ్చిన క్లూస్ టీమ్ విగ్రహ ధ్వంస పరిసరాల్లో దుండగుల ఆధారాల లభ్యం కోసం పరిశీలించింది. సరస్వతీ దేవి విగ్రహ ధ్వంసంపై మండలంలోని హైందవ సంఘాలు, ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

పిఠాపురం పురపాలక సంఘంలో

త్రిసభ్య కమిటీ విచారణ

కాకినాడ జిల్లా పిఠాపురం పురపాలక సంఘంలో కమిషనరు, డీఈఈ మధ్య జరిగిన వాగ్వాదంపై అమరావతి నుంచి వచ్చిన మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉన్నతాధికారులు సోమవారం విచారణ చేపట్టారు. మునిసిపల్ అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్ల నుంచి వివరాలు సేకరించి వారి స్టేట్‌మెంట్లు నమోదు చేసుకున్నారు. ఇద్దరు అధికారులనూ మార్చాలని పలువురు కౌన్సిలర్లు కోరారు.

కమిషనరు, డీఈఈ వివాదంపై వివరాల సేకరణ .... ఇద్దరు అధికారులనూ మార్చాలని కౌన్సిలర్ల వినతి

పిఠాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆగస్టు 31వ తేదీన కమిషనరు కనకారావు, డీఈఈ భవానీప్రసాద్ కౌన్సిల్ సభ్యుల సాక్షిగా వాగ్వివాదానికి దిగి ఒకరిని ఒకరు తోసుకోవడంతో పాటు కొట్టుకున్నారు. అందరూ తలదించుకునే విధంగా బూతులు తిట్టుకున్నారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ కోసం మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అడిషనల్ డైరెక్టరు పి.పూర్ణచంద్రరావు, పబ్లిక్ హెల్త్ డిప్యూటీ ఇంజనీర్-ఇన్-చీఫ్ ఎం.బ్రహ్మాజీ, టౌన్ ప్లానింగ్ అడిషనల్ డైరెక్టరు బి.శ్రీనివాసులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వారు సోమవారం పిఠాపురం పురపాలక సంఘానికి వచ్చి కౌన్సిల్ సమావేశంలో జరిగిన సంఘటనపై విచారణ చేపట్టారు. పుర-పరిపాలన శాఖ ప్రాంతీయ డైరెక్టరు నాగనరసింహరావుతో పాటు ఆగస్టు 31న కౌన్సిల్ సమావేశానికి హాజరైన పలువురు కౌన్సిలర్లు, మునిసిపల్ వైస్ చైర్మన్-2 కొత్తపల్లి పద్మ, అధికారులు, సిబ్బంది నుంచి ఆ రోజు జరిగిన ఘటనపై వివరాలు సేకరించి వారి స్టేట్‌మెంట్లు నమోదు చేసుకున్నారు. కమిషనరు, డీఈఈ స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. సదరు ఘర్షణలో డీఈఈని సస్పెండ్ చేసి కమిషనరుపై చర్యలు తీసుకోకపోవడాన్ని కౌన్సిలర్లు తప్పుపట్టారు. డీఈఈ ఉండగా ఎటువంటి లిఖితపూర్వక ఉత్తర్వులు లేకుండా మరొక డీఈఈతో అనధికారికంగా ఎలా పనిచేయించుకుంటారని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించిన ఏడుగురు ఉద్యోగుల నియమకాలు రద్దు చేయమని తాము తీర్మానం చేశామని, కాని వారికి జీతాలు చెల్లించారని తెలిపారు. కమిషనరు వ్యవహారశైలిపై పలు ఆరోపణలు చేశారు. అందరినీ కించపరిచే విధంగా మాట్లాడుతున్నారని, ఉద్యోగులను దుర్భాషలాడుతున్నారని లిఖితపూర్వకంగా తెలిపారు. ఆనాటి సమావేశంలో ఏమి జరిగిందో తాము గతంలోనే మునిసిపల్ ఆర్డీకి తెలియజేసినా ఏకపక్షంగా ఒకరిపై మాత్రమే చర్యలు తీసుకున్నారని చెప్పారు. కమిషనరుపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కమిషనరు, డీఈఈలను ఇక్కడి నుంచి బదిలీ చేయాలని పలువురు కౌన్సిలర్లు విచారణాధికారులను కోరారు. సమర్థులైన అధికారులను నియమించాలని విజ్ఞప్తి చేశారు.

తాము తిరస్కరిస్తే ఆమోదించినట్టు రాశారు...

ఆగస్టు 31న జరిగిన కౌన్సిల్ సమావేశం అజెండాలో ర్యాటిఫికేషన్‌లకు సంబంధించి 22 అంశాలను తాము రద్దు చేశామని, వాటిపై కౌన్సిలర్లతో కమిటీలు ఏర్పాటు చేయాలని కోరుతూ తీర్మానం చేశామని కౌన్సిలర్లు తెలిపారు. అయితే మినిట్స్‌లో మాత్రం ఈ 22 అంశాలను ఆమోదించినట్టు రాశారని చెప్పారు. కౌన్సిల్ తిరస్కరించిన విషయాలను ఆమోదించినట్టు రాసిన వారిపై చర్యలు తీసుకోవాలని, వాటిని తిరస్కరించినట్టు నమోదు చేయాలని అధికారులను కోరారు. కాగా తాము అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్ల నుంచి వివరాలు సేకరించి స్టేట్‌మెంట్లు రికార్డు చేశామని, కమిషనరు, డీఈఈని విచారించామని, నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అడిషనల్ డైరెక్టరు పూర్ణచంద్రరావు చెప్పారు.



కౌన్సిలర్ల నుంచి వివరాలు తెలుసుకుంటున్న త్రిసభ్య కమిటీ సభ్యులైన మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు

అపార్ట్‌మెంట్ పైనుంచి పడి బాలుడి మృతి

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు





చరణ్ శ్రీతేజ (పాత చిత్రం), విచారణ నిర్వహిస్తున్న ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు, సీఐ పెద్దిరాజు

సర్పవరం జంక్షన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్ పైనుంచి ప్రమాదవశాత్తూ కింద పడి ఓ బాలుడు మృతి చెందాడు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సర్పవరం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... కాకినాడ ఎల్‌బీ నగర్ ఐదో వీధిలో రైస్‌మిల్లు ఎదురుగా గల రేకుల షెడ్డులో కుక్కల మల్లేశ్వరరావు భార్య, కుమారుడు చరణ్ శ్రీతేజ (13) కలిసి ఉంటున్నాడు. తండ్రి ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. చరణ్ శ్రీతేజ అశోక్‌నగర్‌లోని ఒక ప్రైవేట్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి సమీపంలో ఉన్న రాజేశ్వరి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లోకి ఆడుకునేందుకు వెళ్లాడు. అక్కడకు వెళ్లిన కొద్ది నిమిషాల వ్యవధిలోనే అపార్ట్‌మెంట్ నుంచి కింద పడి మృతి చెందాడు. విషయం తెలిసిన సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు, కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు సంఘటనాస్థలానికి చేరుకుని బాలుడు మృతదేహాన్ని పరిశీలించారు. అపార్ట్‌మెంట్ వాసులు, వాచ్‌మెన్‌ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమ కుమారుడిని ఎవరో పై నుంచి తోసేయడంతోనే మృతి చెంది ఉంటాడని తల్లిదండ్రులు పోలీసులకు తెలిపారు. అక్కడే ఉన్న సీసీ పుటేజీలో చరణ్ శ్రీతేజ అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లడాన్ని పోలీసులు పరిశీలించారు. బాలుడి బాబాయి వీరాంజనేయులు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సర్పవరం ఎస్‌హెచ్‌వో పెద్దిరాజు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌లోని మార్చురీకి తరలించినట్లు తెలిపారు. కాగా ఇదే రూటులో వెళ్తున్న కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌ను మృతుని బంధువులు ఆపి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తక్షణం విచారణ నిర్వహించాలని ఎంపీ పోలీసులను ఆదేశించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.



సంఘటనా స్థలంలో మృతి చెందిన అనిల్

మినీ లారీ ఢీకొని వ్యక్తి మృతి

ఎటపాక, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం కూనవరం-భద్రాచలం ప్రధాన రహదారిపై గన్నవరం గ్రామ శివారులో సోమవారం జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం రుద్రంకోట గ్రామానికి చెందిన గాదే అనిల్ (37) భద్రాచలంలోని ఓ ఫెర్టిలైజర్ షాపులో పని చేస్తున్నాడు. ఫీల్డ్ వర్కులో భాగంగా ద్విచక్ర వాహనంపై కూనవరం వెళ్లి తిరిగి భద్రాచలం వెళ్తున్నాడు. భద్రాచలం వైపు నుంచి హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లతో వస్తున్న మినీ లారీ బైక్‌ను ఢీకొట్టింది. అనిల్ తలకు తీవ్ర గాయమై రక్తస్రావం జరిగింది. కొద్దిసేపటికే అతడు మృతి చెందాడు. మినీ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా కారణంగానే ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి



వీరాస్వామి (పాత చిత్రం)

కరప, అక్టోబరు 14: కాకినాడ జిల్లా కాజులూరు మండలం ఉప్పుమిల్లి గ్రామంలో సోమవారం తెల్లవారుజామున పిడుగు పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. కరప మండలం కూరాడ గ్రామానికి చెందిన నందికొండ వీరాస్వామి (35) భార్యతో కలిసి కాజులూరు మండలం ఉప్పుమిల్లిలో ఐదేళ్లుగా నివాసముంటున్నాడు. పశువులను మేపుకుంటూ, తాపీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం వేకువజామున వర్షం పడుతుండడంతో పశువులను పాకలో కట్టేందుకు పొలానికి వెళ్లాడు. అక్కడ పిడుగుపాటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలి మరణించాడు. మృతుడికి భార్య, నాలుగేళ్ల కుమారుడు, మూడేళ్ల కుమార్తె ఉన్నారు. వీరాస్వామి మృతితో స్థానికంగా విషాదం చోటుచేసుకుంది. స్థానిక వీఆర్వో ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. గొల్లపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరాస్వామి మృతితో జీవనాధారం కోల్పోయిన అతడి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని స్థానికులు, బంధువులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆటో బోల్తా: ఆరుగురికి గాయాలు

కొవ్వూరు, అక్టోబరు 14: తూర్పు గోదావరి జిల్లా దొమ్మేరుకు చెందిన కైరా జయశ్రీ మరో ఐదుగురు విద్యార్థులు కొవ్వూరు జూనియర్ కళాశాలకు ఆటోలో బయల్దేరారు. గామన్ బ్రిడ్జి సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. గాయాలపాలైన వారిని హైవే పెట్రోలింగ్ సిబ్బంది కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు పట్టణ హెచ్‌సీ ఎం.సత్యనారాయణ తెలిపారు.



వేదమూర్తి, వీరబ్రహ్మం మృతదేహాలు

కోటిపల్లి గోదావరిలో గల్లంతైన యువకులు మృతి

కె.గంగవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కోటిపల్లి వద్ద ఆదివారం స్నానానికి దిగి గల్లంతైన ఇద్దరు యువకులు మృతి చెందారు. రామచంద్రపురం మండలం రావిచెరువుకు చెందిన నరాల వేదమూర్తి, మేడిశెట్టి వీరబ్రహ్మం శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని కోటిపల్లి వద్ద గోదావరి నదిలో నిమజ్జనం చేయడానికి గ్రామస్తులతో కలిసి వచ్చారు. నిమజ్జనం అనంతరం స్నానానికి దిగి గోదావరి లోతు తెలియక నీటిలో మునిగిపోయారు. స్థానికులు రక్షించడానికి ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. రాత్రిదాకా గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన సమీప ప్రాంతాల్లో సోమవారం వారు విగతజీవులుగా తేలారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించామని, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్‌ఐ ఎస్‌కే జానీబాషా చెప్పారు.

పెళ్లి చేస్తానన్నారని మనస్థాపం

తల్లి ఒంటరి అవుతుందని పురుగుల మందు తాగిన యువతి

చికిత్స పొందుతూ పోస్ట్ ఉమన్ మృతి



సురేఖ (పాత చిత్రం)

ఆత్రేయపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసి నిన్ను అత్తవారింటికి పంపిస్తానని తల్లి చెప్పడంతో మనస్థాపానికి గురైన యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం మెర్లపాలేనికి చెందిన సురేఖ (23) పేరవరంలో పోస్టు ఉమన్‌గా ఉద్యోగం చేస్తోంది. ఆమెకు తండ్రి లేరు. తల్లి వివాహం చేస్తానని చెప్పడంతో మనస్థాపానికి గురైంది. తనకు వివాహం చేస్తే అత్తవారింటికి వెళ్లిపోతానని, తల్లి ఒంటరిగా ఉంటుందని కలత చెందిన సురేఖ గత నెల 30వ తేదీన పేరవరం పోస్టాఫీసు వద్ద పురుగుల మందు తాగింది. స్థానికులు ఆమెను రాజానగరం జీఎస్‌ఎల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ పెద్దిరాజు తెలిపారు.

34 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సూర్య అప్పారావు

ఏలేశ్వరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం సి.రాయవరం గ్రామ సమీపాన ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న 34 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ సూర్య అప్పారావు తెలిపారు. తమిళనాడుకు చెందిన పుగాజ్‌హేంది (23) చెడు వ్యసనాలకు అలవాటుపడి డబ్బు సంపాదించడానికి గంజాయిని మార్గంగా ఎంచుకున్నాడు. అక్రమంగా రవాణా చేస్తూ ఏలేరు కాలువ పరిధిలో పోలీసులకు పట్టుబడ్డాడు. 34 కిలోల గంజాయిని 16 ప్యాకెట్లు చేసి మోటారు సైకిలుపై తరలిస్తుండగా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారని సీఐ చెప్పారు. పుగాజ్‌హేందిపై కేసు నమోదు చేశారు. సీఐ, ఏలేశ్వరం ఎస్‌ఐ రామలింగేశ్వరరావు, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.



బోల్తా పడిన ఆటోలోంచి మహిళలను కాపాడి సపర్యలు చేస్తున్న దృశ్యం

ఆటో బోల్తా: ముగ్గురు మహిళలకు గాయాలు

సామర్లకోట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట-కాకినాడ ప్రధాన రహదారిలో మాధవపట్నం వంతెన సమీపంలో 12 మందితో కాకినాడ వెళ్తున్న గోతిలో పడి అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లో బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. ఆటో డ్రైవరు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడంతో పాటు అజాగ్రత్తగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అటుగా వెళ్తునన వారు ప్రయాణికులను రక్షించి చికిత్స నిమిత్తం కాకినాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తలుపులమ్మ అమ్మవారికి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు పూజలు

తుని రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి పశ్చిమ గోదావరి జిల్లా ఉండి ఎమ్మెల్యే కె.రఘురామకృష్ణరాజు సోమవారం విచ్చేశారు. ఆయనకు పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం రఘురామ అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించారు. వేద పండితులు ఆయన్ను ఆశీర్వదించగా ఈవో పి.విశ్వనాథరాజు మహా ప్రసాదం అందజేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితురాలు కావ్య

అప్పు తీర్చమంటే... వైసీపీ నాయకుడు దాడి చేశాడు

నాపై కేసు పెట్టమని మాజీ ఎంపీ భరత్ అనడం న్యాయమా: యాంకర్ కావ్యశ్రీ

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నాపై వైసీపీ నాయకుడు ఎన్వీ శ్రీనివాస్ దాడి చేస్తే తిరిగి నాపైనే కేసుపెట్టమని మాజీ ఎంపీ భరత్‌రామ్ అనడం ఎంతవరకు న్యాయమని యాంకర్ కావ్యశ్రీ ప్రశ్నించారు. సోమవారం ఆమె తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రెస్ క్లబ్‌లో తెలుగు మహిళా నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నాయకుడు శ్రీనివాస్ తనయుడు అభిలాష్‌కు తాను మూడేళ్ల కిందట రూ.3 లక్షలు అప్పుగా ఇచ్చానని, అప్పట్నుంచీ 30 సార్లకు పైగా అడిగానన్నారు. ప్రతిసారీ వీడియో రికార్డింగ్ చేశానన్నారు. ఆ సొమ్మును తిరిగి అడిగినందుకు దాడి చేశారన్నారు. అప్పు విషయమై గతంలో ఎంపీ భరత్‌రామ్‌కు చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు నాపై దాడి జరిగితే తిరిగి నాపైనే కేసుపెట్టమని అదే భరత్ చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. శ్రీనివాస్‌ను కఠినంగా శిక్షించి న్యాయం చేయాలని హోం మంత్రి అనితను కోరతామన్నారు. తెలుగు మహిళా నేతలు మాలే విజయలక్ష్మి, కోసూరి చండీప్రియ మాట్లాడుతూ వైసీపీ నాయకులంతా ఇంకా అధికారంలో ఉన్నామనే భ్రమలో వుండి అహంతో వ్యవహరిస్తున్నారన్నారు. మహిళలపై దాడులను కూటమి ప్రభుత్వం సహించదన్నారు. బాధిత మహిళకు అండగా ఉంటామన్నారు. సమావేశంలో తెలుగు మహిళలు బోను ఈశ్వరి, శ్రీలత, లక్ష్మి పాల్గొన్నారు.

సికింద్రాబాద్-కాకినాడ మధ్య నేడు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు

సామర్లకోట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగకు తమ స్వగ్రామాలకు వెళ్లి తిరిగి తమ గమ్యస్థానాలకు తిరిగివెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే అధికారులు మంగళవారం సికింద్రాబాద్-కాకినాడ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు నడుపుతున్నట్టు సికింద్రాబాద్ రైల్వే ఉన్నతాధికారులు ప్రత్యేక సమాచారం జారీ చేశారు. మంగళవారం సాయంత్రం 6.50 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరే ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, తణుకు, నిడదవోలు, రాజమహేంద్రవరం, సామర్లకోట మీదుగా కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుంది. ఇందులో ఒక ఫస్ట్ క్లాస్ ఏసీ బోగీ, ఏసీ టూటైర్, త్రీటైర్, ఏసీ స్లీపర్, సెకండ్ క్లాస్, జనరల్ బోగీలు ఉంటాయి.

జాతీయస్థాయి పోటీల్లో యానాం శారదా విద్యార్థిని ప్రతిభ



యానాం(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: పుదుచ్చేరిలో జరిగిన జాతీయ స్థాయి అత్యా, పత్యా పోటీల్లో యానాం శారదా విద్యా నికేతన్ విద్యార్థిని చింతా శ్రీదుర్గాలక్ష్మీ షణ్ముఖప్రియ పుదుచ్చేరి రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించి ఇండియా లెవెల్‌లో బంగారు పతకం దక్కించుకుందని హెచ్‌ఎం చిక్కాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈనెల11నుంచి 13వరకు ఈపోటీలు జరిగాయి. ఈపోటీల్లో ప్రతిభ సాధించిన విద్యార్థిని శ్రీదుర్గాలక్ష్మీ షణ్ముఖప్రియను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు కంచర్ల చిన్నాబ్బాయి, కాపగంటి ఉమాశంకర్, కంచర్ల శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు చింతా వెంకన్న, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

చట్టాలపై అవగాహన

యానాం(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: స్థానిక సర్వశిక్ష అభియాన్ సమావేశాపు హాల్‌లో సోమవారం యానాం నియోజకవర్గంలోని పోలీసులకు క్రిమినల్ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యానాం ఎస్పీ రాజశేఖరన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పుదుచ్చేరి నుంచి వచ్చిన ఎస్పీ రంగనాథ్, సీఐ రఘుపతి బృందం సిబ్బందికి అవగాహన కల్పించారు. ఇటీవల నూతనంగా అమలులోకి వచ్చిన క్రిమినల్ చట్టాలు, వాటి అమలును పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో యానాం సీఐ షణ్ముగం, ఎస్‌ఐలు మురుగానందం తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పట్టాదారు పాసుపుస్తకం జాప్యంపై విచారణ

కాట్రేనికోన(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: పట్టాదారు పాసుపుస్తకం జారీలో జాప్యంపై కందికుప్ప శివారు బొజ్జావారిపేటకు చెందిన బొజ్జా విజయలక్ష్మి ఫిర్యాదుపై తహసీల్దార్ విచారణ చేశారు. తన రెండెకరాల భూమికి పట్టాదారు పాసుపుస్తకం రాకుండా కొందరు అడ్డుపడుతున్నారని బాధితురాలు వివరించారు. రెండు నెలల్లో పాస్ పుస్తకం ఇస్తామని తహసీల్దార్ సురేష్‌కుమార్ హామీ ఇచ్చారు.

సీపీఎం మండల కార్యదర్శిగా రాంబాబు

సీపీఎం మండల కార్యదర్శిగా విత్తనాల రాంబాబు ఎన్నికైనట్టు పార్టీ సభ్యుడు జి.దుర్గాప్రసాద్ తెలిపారు. గెద్దనపల్లిలో పార్టీ మహాసభ నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కారెం వెంకటేశ్వరరావు, విప్పర్తి మోహనరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికే పల్లె పండుగ: బుచ్చిబాబు



కొత్తలంకలో పల్లెపండుగలో సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

ముమ్మిడివరం, అక్టోబరు 14: గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పల్లెపండుగ, పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు(బుచ్చిబాబు) పేర్కొన్నారు. మండలంలో సోమవారం పల్లెపండుగ, పంచాయతీ వారోత్సవాలు ఎమ్మెల్యే ప్రారంభించారు. మండలంలో అన్నాతరం, సీహెచ్.గునేపల్లి, ఐనాపురం, కొత్తలంక, చినకొత్తలంక, మర్లపాలెం, కర్రివానిరేవు, గేదెల్లంక, గాడిలంక, అన్నంపల్లి, రాపచింతలపూడిపాలెం, పల్లవారిపాలెం తదితర గ్రామాల్లో సోమవారం నిర్వహించిన పల్లెపండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామాల మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల విధ్వంస పాలనలో అభివృద్ధి లేక గ్రామాలు అంధకారంలో మునిగిపోయ్యాయన్నారు. సుపరిపాలన అందించే దిశగా కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఎన్‌ఆర్‌జీఎస్ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 51 గ్రామాల్లో రూ.13.43కోట్లతో 24.150కిలోమీటర్ల మేర సీసీరోడ్లు చేపడతామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాయకులు గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, తాడి నరసింహరావు, అర్దాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణకుమార్, చిక్కాల అంజిబాబు, గుద్దటి జమ్మి, పాదోకు నారాయణరావు, దూడల స్వామినాయుడు, గోదాసు పుండరీష్, గొల్లపల్లి గోపి, యాళ్ల ఉదయ్, దాట్ల బాబు, గేదెల రాఘునాధ్‌బాబా, నిమ్మితి చిరంజీవి, దంగేటి శ్రీనివాస్, కురసాల శివబాబు, గీసాల చంద్రరావు, దాసరి సాయిబాబు, బొంతు నాగరాజు, రేఖాటి నాగబాబు, గుద్దటి వీరాస్వామినాయుడు, బొక్కా సత్యనారాయణ, సంసాని సత్యనారాయణ, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, కుంచనపల్లి వెంకన్నబాబు, నాగరాజు వర్మ, పాత్రుని బుజ్జి, ఐయ్యాల శ్రీనివాస్, కోరసిక రాము, బూరుగు కళ్యాణ్, తొతరపూడి జ్యోతిబాబు, కాశీ లాజర్, డోమా పీడీ ఎస్.మధుసుధనరావు, ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్యులు, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ పార్థసారది, పంచాయతీ డీఈ పాల్లకొల్లు విజయశ్రీనివాస్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



పల్లెపండుగ కార్యక్రమంలో సీసీ రోడ్డుకు శంకస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అయినవిల్లి(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టిందన్నారు. పల్లె పండుగ కార్యక్రమం గ్రామాల్లో అభివృద్ధి వెలుగులు విరజిమ్ముతుందన్నారు. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌తో సాధ్యమవుతుందన్నారు. సోమవారం పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా మండలంలో సిరిపల్లి, విలస, మాగాం, పోతుకుర్ర, శంకరాయగూడెం, క్రాప, కె.జగన్నాథపురం, తొత్తరమూడి, శానపల్లిలంక, ఎస్.మూలపొలం, కొండుకుదురు, పొట్టిలంక గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో చిట్టూరి శ్రీనివాస్, మద్దాల సుబ్బారావు, వేటకూరి రమేష్‌రాజు, మేడిద దుర్గాప్రసాద్, కోనే సునీత సుబ్బలక్ష్మి, బొబ్బా ప్రభాత్‌కుమార్, వారా లక్ష్మీనరసింహరామ్, బొబ్బిలిఅయ్యప్ప, నక్కా వెంకటేశ్వరరావు, కాశి వీరవెంకటసత్యనారాయణ, మతుకుమిల్లి బాబూరావు, కల్లేపల్లి సుబ్బరాజు, సలాది బుచ్చిరాజు, పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండుగ ప్రగతికి పునాది: ఎమ్మెల్యే దేవ



కేశవదాసుపాలెంలో పల్లె పండుగ సందర్భంగా సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అంతర్వేది(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: సఖినేటిపల్లి మండలం అంతర్వేది దేవస్థానం, అంతర్వేది పల్లిపాలెం, కేశవదాసుపాలెం, గుడిమూల, గొంది గ్రామాల్లో పంచాయతీ వారోత్సవాలను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రారంభించారు. తొలుత అంతర్వేది లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర ప్రాంత గ్రామాల్లో సీసీ రోడ్లకు భూమిపూజా కార్యక్రమాల్లో పాల్గొని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కొబ్బరికాయ కొట్టారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతీ పల్లెటూరును మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దేందుకు పల్లెపండుగ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. రూ.11.30కోట్లతో 208 గ్రామీణ సిమెంటు రోడ్లకు శంకుస్థాపన వారోత్సవాలు జరగడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, మాలే శ్రీనివాసనగేష్, పినిశెట్టి బుజ్జి, పోతురాజు కృష్ణ, చాగంటి స్వామి, తిరుమాని ఆచార్యులు, డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఉండపల్లి అంజి, ఎంపీటీసీ బైరా నాగరాజు, కూటమి శ్రేణులుపాల్గొన్నారు. సఖినేటిపల్లిపాలెంలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కిమ్స్ ఆసుపత్రి చైర్మన్ చైతన్యరాజు సౌజన్యంతో మెడ్ యునైటెడ్ ఆసుపత్రి బ్రాంచిని సోమవారం ప్రారంభించారు.

అర్బన్ హెల్త్ సెంటర్ హడావిడిగా ప్రారంభం

- నేటికీ తెరుచుకోని తాళాలు
- శాశ్వత వైద్యాధికారి, స్టాఫ్ నర్సు,
- వైద్య సిబ్బందిని నియమించాలి





అమలాపురం ఈడబ్ల్యుఎస్ కాలనీలో నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, హెల్త్ సెంటర్ అద్దాలు ధ్వంసం

అమలాపురం టౌన్, అక్టోబరు 14: భవన నిర్మాణం పూర్తి చేశారు. మౌలిక సదుపాయాలు కల్పించడం మరిచారు. అయినా సార్వత్రిక ఎన్నికలకు ముందు హడావిడిగా అమలాపురం ఈడబ్ల్యుఎస్ కాలనీలో అర్బన్ ప్రైమరీ హెల్త్ క్లినిక్‌ను అప్పటి మంత్రి పినిపే విశ్వరూప్ ప్రారంభించారు. అప్పుడు వేసిన తాళాన్ని ఇప్పటికీ తీయలేదు. పట్టించుకునే నాథుడు కూడా లేకపోవడంతో కిటికీలకు అమర్చిన అద్దాలన్నింటినీ పగులకొట్టేశారు. ఇలాగే వదిలేస్తే చెదలు పట్టే ప్రమాదం ఉంది. భవనాన్ని నిర్మించిన కాంట్రాక్టరు ప్లంబింగ్, ఎలక్ట్రికల్ వైరింగ్, వాటరు ప్లాంటు ఏర్పాటు చేయకుండానే అధికారులకు అప్పగించి వెళ్లిపోయాడు. పనులు పూర్తి కాకుండా సిబ్బందిని నియమించకుండా భవనాన్ని ప్రారంభించడం వల్లే ఈపరిస్థితి ఏర్పడిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ కేటాయించిన రూ.1.05కోట్లతో 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం' పేరిట పట్టణంలోని 27వ వార్డులో అర్బన్ ప్రైమరీ హెల్త్ క్లినిక్ నిర్మించారు. దీనిని ఈఏడాది మార్చి 7న హడావిడిగా ప్రారంభించారు. తాత్కాలికంగా ఒక వైద్యాధికారిని నియమించారు. మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు శాశ్వత వైద్యాధికారి, స్టాఫ్ నర్సు, ఇతర వైద్య సిబ్బందిని నియమించాల్సి ఉంది. రోగుల కోసం పది బెడ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటికే పట్టణంలో పలువురు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈఆసుపత్రిలో వైద్య సేవలను అందుబాటులోకి తీసుకు రావాల్సి ఉంది. నిరుపయోగంగా ఉన్న భవనాన్ని కూటమి ప్రభుత్వం వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నేటికీ తెరుచుకోని తాళాలు

కొబ్బరిచెట్ల వేలంలో అక్రమాలు

సమస్యలపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆగ్రహం

వాడీవేడిగా అల్లవరం మండల సర్వసభ్య సమావేశం



మండల పరిషత్ సమావేశంలో ఆగ్రహంతో మాట్లాడుతున్న సర్పంచ్ దాకారపు చిరంజీవిరావు

అల్లవరం(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: గూడాల పంచాయతీలో కొబ్బరి చెట్ల వేలంలో రశీదులు ఇవ్వలేదని సర్పంచ్‌ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే గుండెపూడి ఆర్‌డబ్ల్యుఎస్ ప్రాజెక్టుపై అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. సర్పంచ్‌ల ఆగ్రహావేశాల మధ్య అల్లవరం మండల సర్వసభ్య సమావేశం సోమవారం వాడీవేడిగా సాగింది. అల్లవరంలో ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. గూడాలపంచాయతీ పరిధిలోని కొబ్బరిచెట్లకు రూ.47 వేలకు వేలం పాట జరిపి కార్యదర్శి రశీదు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారని గ్రామ సర్పంచ్ దాకారపు చిరంజీవిరావు అధికారులపై ధ్వజమెత్తారు. అంగన్‌వాడీ కేంద్రాల పట్ల నిర్లక్ష్యం తగదని, కేంద్రాల్లో పిల్లలు, సరుకులు ఉండడం లేదని సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీనివాస్, ఎంపీటీసీ ఎస్.మౌనిక ఆరోపించారు. సర్వశిక్షాభియాన్ భవన పెండింగ్ బిల్లులు రాకుంటే ఆందోళన చేస్తామని ఎంపీటీసీలు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, గుబ్బల బాబ్జి ఆరోపించారు. గుండెపూడి ఆర్ డబ్ల్యుఎస్ ప్రాజెక్టు గట్టు జారినా పట్టించుకోలేదని, మండలంలోని రెండు ప్రాజెక్టుల పట్ల అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని సర్పంచ్ దాకారపు చిరంజీవిరావు ధ్వజమెత్తారు. గూడాల వీఆర్వో మోహనరావు డబ్బులిస్తే గానీ పనులు చేయడం లేదన్నారు. తాగునీరు, రోడ్ల దుస్థితి తదితర సమస్యలపై సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మినీ గోకులం షెడ్ల మంజూరు పక్షపాతంగా జరుగుతున్నాయని సభ్యులు ఆరోపించారు. వైస్‌ఎంపీపీలు ముత్యాల రామకృష్ణ, వడ్డి గంగ, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పక్కా రహదారి నిర్మిస్తేనే వాహనాలను అనుమతిస్తాం

- ఓఎన్జీసీ వాహనాలను అడ్డుకుని ఆందోళన చేసిన గ్రామస్తులు
- రహదారి నిర్మాణానికి ఓఎన్జీసీ అంగీకారం



ఉప్పలగుప్తం-చీకట్లపాలెం సెంటర్‌లో ఓఎన్జీసీ వాహనాలను అడ్డగించి రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

ఉప్పలగుప్తం(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: ఉప్పలగుప్తం పంచాయతీ పరిధిలోని చీకట్లపాలెం సెంటర్ నుంచి పేరాయిచెరువు ఓఎన్జీసీ సైట్ వరకు పక్కా రహదారి నిర్మించే వరకు ఓఎన్జీసీ వాహనాలను అడ్డుకుంటామని ఉప్పలగుప్తం గ్రామస్థులు హెచ్చరించారు. డ్రిల్లింగ్ సైట్‌కు భారీ యంత్ర సామగ్రిని తరలిస్తున్న వాహనాలను సోమవారం చీకట్లపాలెం సెంటర్‌లో అడ్డగించి ఆందోళన చేశారు. చీకట్లపాలెం- పేరాయిచెరువు రహదారిని ఆనుకుని చీకట్లపాలెం, పేరాయిచెరువుల్లో ఓఎన్జీసీ డ్రిల్లింగ్ సైట్‌లు ఉన్నాయి. ఒక సైట్‌లో చమురు ఉత్పత్తి జరుగుతుండగా మరో చోట ఉత్పత్తికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో కొన్ని రోజులుగా భారీవాహనాలు ఈరహదారిపై రాకపోకలు సాగిస్తున్నాయి. ఐదేళ్లుగా ఈరహదారి శిథిలమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈగోతుల రహదారిలోనే భారీ యంత్రాలను తరలించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్ కడిమి చిన్నవరాజు ఆధ్వర్యంలో ఆందోళనకు దిగిన గ్రామస్తులు రహదారి నిర్మాణం అనంతరం మాత్రమే కార్యకలాపాలు జరపాలని ఓఎన్జీసీ అధికారులను హెచ్చరించారు. మధ్యాహ్నం తహసీల్దార్ వీఎస్ దివాకర్, ఎస్‌ఐ చలమల రాజేష్, ఓఎన్జీసీ చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు సమక్షంలో చర్చల అనంతరం పక్కా రహదారి నిర్మాణానికి తీర్మానం చేశారు. త్వరలోనే రహదారి పనులు ప్రారంభిస్తామని ఓఎన్జీసీ హామీ ఇవ్వడంతో ఆందోళనకు తెరపడింది. చిక్కం బాలయ్య, రవణం మధు, చిక్కం ఉమేష్, ఆకుల సూర్యనారాయణమూర్తి, పెయ్యల దుర్గారావు, సలాది శ్రీనివాసరావు, మధుర నరసింహమూర్తి, చిక్కం కాసు, చిక్కం వెంకటకృష్ణ, చిక్కం భీముడు, మధుర ప్రతాప్, ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్సవంలో డీజేలు ఏర్పాటు చేస్తే సీజ్ చేస్తాం

డీఎస్పీ వై.మాధవరావు



అంబాజీపేట(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: అంబాజీపేటలో బుధవారం నిర్వహించనున్న శ్రీవిజయ బేతాళ ఉత్సవంలో డీజేలు ఏర్పాటుచేస్తే వాహనంతో పాటు బాక్సులను సీజ్ చేస్తామని కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు హెచ్చరించారు. అంబాజీపేట పెద్దవీధిలోని కల్యాణమండపంలో సీఐ రుద్రరాజు భీమరాజు ఆధ్వర్యంలో 13 వాహనాలకు సంబంధించిన ఉత్సవ కమిటీ నిర్వాహకులతో డీఎస్పీ సమావేశం నిర్వహించారు. ఉత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. అశ్లీల కార్యక్రమాలను ఏర్పాటుచేస్తే ఆయా కమిటీ నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే ఉత్సవంలో హిజ్రాల డ్యాన్స్‌లు, రికార్డింగ్ డ్యాన్స్‌లు ఏర్పాటుచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. జాతరలో నాలుగు బాక్సులకు మాత్రమే పోలీసుల నుంచి అనుమతి తీసుకుని అనుభవం కలిగిన వ్యక్తితో వాటిని వినియోగించాలని సూచించారు. అలాగే ఉత్సవంలో ఎక్కడా సినీ, రాజకీయ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయకూడదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు కె.చిరంజీవి, కె.చిరంజీవి, చైతన్యకుమార్, శివకృష్ణ, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు

రేపు రామచంద్రపురంలో జాబ్‌మేళా

అమలాపురం టౌన్(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: జిల్లా ఉపాధి కార్యాలయంలో, స్కిల్ డెవలెప్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రముఖ ప్రైవేటు కంపెనీల్లో పనిచేసేందుకు ఈనెల16న రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10.30గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి యి.వసంతలక్ష్మి తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు, బయోడేటా జిరాక్సు కాపీలతో హాజరు కావాలని, మరిన్ని వివరాలకు సెల్ 8247645389ను సంప్రదించాలన్నారు.

వైభవంగా నిమజ్జనోత్సవం

అమలాపురంటౌన్(ఆంధ్రజ్యోతి), అక్టోబరు14: స్థానిక గాంధీనగర్‌లోని శ్రీకనకదుర్గ ఆలయం వద్ద ప్రతిష్ఠించిన అమ్మవారి నిమజ్జనోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. శక్తివేషాలు, కోబ్రా డ్యాన్సులు, కేరళ వాయిద్యాలతో చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు తిక్కిరెడ్డి ఆదినారాయణ ఆధ్వర్యంలో నిమజ్జనోత్సవం జరిగింది.

రాజోలు సీపీఎం శాఖ కార్యదర్శిగా కారుపల్లి

రాజోలు(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: రాజోలు సీపీఎం శాఖ కార్యదర్శిగా కారుపల్లి గోపాలన్‌ను ఏకగ్రీవంగా సోమవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజోలు అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో జరిగిన శాఖ మహాసభకు సీపీఎం పార్టీ జిల్లా కన్వీనర్ కె.వెంకటేశ్వరరావు పరిశీలకునిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా కన్వీనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పేదల పక్షాన సీపీఎం రాజీలేని పోరాటం చేసిందని పేర్కొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పీతల రామచంద్రరావు, బుంగ సత్యనారాయణ, కందికట్ల గిరిజ, తాడి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వసుధ ఫౌండేషన్ ఆర్థికసాయం

మలికిపురం(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: పలు ప్రమాదాల్లో గాయపడిన పలువురికి వసుధ ఫౌండేషన్ సాయం అందజేసింది. మలికిపురంలో సంస్థ ప్రతినిధులు జంపన బుజ్జిరాజు ఇంటి వద్ద బి.శ్రీనివాస్‌కు రూ.20వేలు, కె.స్రవంతికి రూ.10వేలు, వి.రాంబాబుకు రూ.10వేలు, పి.రమణకు రూ.10వేలు, జి.మల్లేశ్వరావుకు రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్నారు.

యానాంలో పర్యాటక శాఖ డైరెక్టర్ పర్యటన

యానాం(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: యానాంలో పుదుచ్చేరికి చెందిన పర్యాటక శాఖ డైరెక్టర్ కె.మురళీధరన్ పర్యటించారు. మూడు రోజుల పర్యటనలో ఆయన యానాం వచ్చారు. యానాం ఆర్‌ము మునిస్వామి, సీగల్స్ మేనేజర్ ఆయనను సత్కరించారు. ఈసందర్భంగా యానాంలోని పలు పర్యాటక శాఖ ప్రాజెక్టులను పరిశీలించారు. ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. మంగళవారం పలు ఐలాండ్ ప్రాంతాలను సందర్శించనున్నారు.

ప్రమాదకరంగా జాతీయ రహదారి



మామిడికుదురు(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: పాశర్లపూడిలోని జాతీయ రహదారి ప్రమాదకరంగా ఉంది. పాశర్లపూడి కైకాలపేట నుంచి కొండాలమ్మ చింత వరకు కిలోమీటరు మేర జాతీయ రహదారి గోతుల మయంగా తయారై ప్రమాదాలకు నిలయంగా మారింది. వర్షం వస్తే ఈగోతుల్లో నీరు చేరి ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం విజయదశమి రోజున ఈగోతుల రోడ్డులో ఆటో బోల్తా పడింది. డ్రైవరు క్షేమంగా బయటపడడంతో పెను ప్రమాదం తప్పింది. గోతులుపడిన రోడ్డును ఆధునికీకరించాలని ప్రజలు కోరుతున్నారు.

కొలిక్కిరాని అధ్యాపకుల సమస్య

మలికిపురం(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: 34 రోజులుగా మలికిపురం ఎంవీఎన్ జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు సమ్మె చేస్తున్నారు. పెండింగ్ జీతాలు చెల్లించాలంటూ చేస్తున్న దీక్షకు పలు ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు మద్దతు పలుకుతున్నాయి. యాజమాన్యం మొండి వైఖరి విడనాడకపోవడంతో కరస్పాండెంట్ ఎంవీ సత్యనారాయణమూర్తి చాంబర్‌ను అధ్యాపకులు ముట్టడించారు. పోలీసులు రంగ ప్రవేశంచేసి కరస్పాండెంట్‌ను చాంబర్ నుంచి పంపివేశారు.

బాధ్యతగా పనిచేసే అధికారులకు చిరకాల గుర్తింపు

అల్లవరం(ఆంధ్రజ్యోతి), అక్టోబరు14: విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేసే అధికారులు, ఉద్యోగులకు చిరకాల గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ అన్నారు. బదిలీ అయిన పంచాయతీరాజ్ ప్రాజెక్టు ఏఈ జీహెచ్‌ఆర్ సంపన్, ఆఫీస్ సబార్డినేట్‌లు జాషువా, బంగారు శ్రీనులను సన్మానించారు. సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకట్రావు, సర్పంచ్‌లు తిక్కిరెడ్డి శ్రీనివాస్, రొక్కాల విజయలక్ష్మి, కడలి గంగాచలం, ఎంపీటీసీ ఎస్.మౌనిక, సెక్రటరీ రాజామోహన్‌పాల్గొన్నారు.

ఘనంగా దసరా ఊరేగింపు:

డి.రావులపాలెం, గోడితిప్ప గ్రామాల్లో దసరా ఊరేగింపులు ఘనంగా జరిగాయి. బుట్టబొమ్మలు, బ్యాండు మేళతాళాలతో ఊరేగింపులు నిర్వహించారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళి



హైదరాబాద్‌లో ప్రొఫెసర్ సాయిబాబా మృతదేహం వద్ద విలపిస్తున్న అయినవిల్లి మాజీ జడ్పీటీసీ గంగుమళ్ల కాశీఅన్నపూర్ణ దంపతులు

అయినవిల్లి(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: హక్కుల ఉద్యమనేత అమలాపురం పట్టణానికి చెందిన గోకరకొండ నాగసాయిబాబ అనారోగ్యంతో మృతిచెందడంతో అయినవిల్లి మాజీ జడ్పీటీసీ గంగుమళ్ల కాశీ అన్నపూర్ణ-శ్రీనివాస్ దంపతులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌కు చేరుకుని సోమవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. భార్య వసంత, కుమార్తె మంజీర, సోదరుడు రామ్‌దేవ్‌లను ఓదార్చారు. మానవహక్కుల పరిరక్షణ కోసం, ఆదివాసీల సమస్యల పరిష్కారానికి సాయిబాబా చేసిన సేవలను కొనియాడారు.

క్షయవ్యాధి అంతం.. మనందరి పంతం

అంతర్వేది(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: జాతీయ క్షయవ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా సఖినేటిపల్లిలంక గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద క్షయవ్యాధిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. క్షయవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధి సోకిన వారు వైద్య సిబ్బంది సలహాలు పాటిస్తూ డాట్ చికిత్సా పద్ధతి విధానాన్ని పాటించాలని సూచించారు. సఖినేటిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద కళ్లె పరీక్ష చేయించుకోవాలని, అత్యాధునిక ట్రూనాట్ పరికరం ద్వారా వ్యాధి నిర్ధారణ చేసిన వారికి చికిత్స ఉచితంగా ఇంటి వద్దే డాట్ పద్ధతిలో ఆశ కార్యకర్త అందజేస్తారన్నారు. చికిత్స కాలంలో నవంబరు నెల 1వ తేదీ నుంచి రూ.వెయ్యి చెల్లిస్తారని డాక్టర్ సీహెచ్ దుర్గాకావ్య తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రేపూరి రాజేశ్వరి ఏసునరసింహరాజు, గునిశెట్టి రాంజీ, పడాల పెద్దకాపు, వీవీఎస్ఎన్ మూర్తి, పీఎల్ఎన్ స్వామి, ఎ.సరస్వతి పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు 43మంది హాజరు

పి.గన్నవరం(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: జిల్లా ఉపాధి కార్యాలయం, స్కిల్ డెవలప్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో నరేంద్రపురం గురుకుల పాఠశాల వద్ద జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్‌మేళాలో మూడు ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయి. 43మంది పాల్గొనగా 12మందిని ఎంపిక చేసినట్లు స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బంది తెలిపారు. జిల్లా స్కిల్ డెవల ప్‌మెంట్ అధికారి డి.హరిశేషు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.వేణు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం:మంత్రి సుభాష్

ద్రాక్షారామ(ఆంధ్రజ్యోతి), అక్టోబరు14: దుర్గాదేవి నిమజ్జనం సందర్భంగా కోటిపల్లి గోదావరిలో మునిగి ఇద్దరు యువకులు మృతి చెందడం దురదృష్టకరమని, బాధిత కుటుంబాలను ఆదుకుంటామని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సోమవారం రామచంద్రపురం మండలం రావిచెరువులో బాధిత కుటుంబాలను మంత్రి పరామర్శించి ఓదార్చారు. నరాల వేదమూర్తి, మేడిశెట్టి వీరబ్రహ్మం మృతదేహాలకు నివాళులర్పించారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఊరేగింపు

అంబాజీపేట(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న శ్రీవాసవికన్యకపరమేశ్వరి అమ్మవార్ని శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం వైభవంగా ఊరేగించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంలో ఊరేగించారు. అంబాజీపేట పశువుల సంతమార్కెట్ వద్ద ఉన్న శ్రీవిజయకనకదుర్గమ్మ అమ్మవార్ని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈసందర్భంగా గరగనృత్యాలు, కోయిడ్యాన్స్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వాకలగరువు, మాచవరం ఇటికాలమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల ఆలయాల్లో నెలకొల్పిన అమ్మవార్లను ఘనంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. అనంతరం ఆయా ఆలయాల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు.

నేడు శాలివాహన సంఘ సమావేశం

అంబాజీపేట(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: మాచవరం సంఘ భవనంలో కోనసీమ జిల్లా శాలివాహన సంక్షేమ సంఘ సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు మానేపల్లి వీరబ్రహ్మం, డి.భీమేశ్వరరావు తెలిపారు. సమావేశంలో పలు విషయాలను చర్చిస్తామన్నారు. సమావేశానికి శాలివాహన సంఘీయులంతా హాజరుకావాలని కోరారు.


గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి



సన్నవిల్లిలో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

ఉప్పలగుప్తం(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఐదేళ్లుగా క్షీణదశలో ఉన్న గ్రామీణ రహదారులకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కృషితో మహర్దశ పట్టిందన్నారు. పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఎన్.కొత్తపల్లి, వానపల్లిపాలెం, మునిపల్లి, చినగాడవిల్లి, గొల్లవిల్లి, సన్నవిల్లి, ఉప్పలగుప్తం, పెదగాడవిల్లి గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో ఏఎంసీ మాజీ చైర్మన్ నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి, సర్పంచ్‌లు కుంచే చిట్టికుమారిచిన్ని, నల్లా బాబండి, బద్రి బాబ్జి, గుద్దటి మహాలక్ష్మీనాగరాజు, చిక్కం జంగమయ్య, జొన్నాడ శ్రీదుర్గాచిన్ని, కడిమి చిన్నవరాజు, యర్రంశెట్టి రామచంద్రరావు, ఎంపీటీసీలు నిమ్మకాయల రాము, వంగా గిరిజానాగకుమారి, కూటమి నాయకులు మంచెం బాలకృష్ణ, ఆకుల సూర్యనారాయణమూర్తి, సలాది నాగరాజు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా రాజ్‌కుమార్



ఉప్పలగుప్తం(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారిగా ఈవోపీఆర్డీ పీతరేసీ రాజ్‌కుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఈవో ఉత్తర్వులిచ్చినట్లు కార్యాలయ పాలనాధికారి ఎంఎల్ఎన్ మూర్తి తెలిపారు. సోమవారం ఎంపీడీవో(ఎఫ్ఏసీ)గా రాజ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు.

ఆంధ్రజ్యోతి
మండపేట
మంగళవారం 15 అక్టోబరు 2024

జాతీయస్థాయి పోటీల్లో యానాం శారదా విద్యార్థిని ప్రతిభ



యానాం(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: పుదుచ్చేరిలో జరిగిన జాతీయ స్థాయి అత్యా, పత్యా పోటీల్లో యానాం శారదా విద్యా నికేతన్ విద్యార్థిని చింతా శ్రీదుర్గాలక్ష్మీ షణ్ముఖప్రియ పుదుచ్చేరి రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించి ఇండియా లెవెల్‌లో బంగారు పతకం దక్కించుకుందని హెచ్‌ఎం చిక్కాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈనెల11నుంచి 13వరకు ఈపోటీలు జరిగాయి. ఈపోటీల్లో ప్రతిభ సాధించిన విద్యార్థిని శ్రీదుర్గా లక్ష్మీ షణ్ముఖప్రియను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు కంచర్ల చిన్నాబ్బాయి, కాపగంటి ఉమాశంకర్, కంచర్ల శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు చింతా వెంకన్న, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

చట్టాలపై అవగాహన

యానాం(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: స్థానిక సర్వశిక్ష అభియాన్ సమావేశపు హాల్‌లో సోమవారం యానాం నియోజకవర్గంలోని పోలీసులకు క్రిమినల్ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యానాం ఎస్పీ రాజశేఖరన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పుదుచ్చేరి నుంచి వచ్చిన ఎస్పీ రంగనాథ్, సీఐ రఘుపతి బృందం సిబ్బందికి అవగాహన కల్పించారు. ఇటీవల నూతనంగా అమలులోకి వచ్చిన క్రిమినల్ చట్టాలు, వాటి అమలును పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో యానాం సీఐ షణ్ముగం, ఎస్ఐలు మురుగానందం తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పట్టాదారు పాసుపుస్తకం జాప్యంపై విచారణ

కాట్రేనికోన(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: పట్టాదారు పాసుపుస్తకం జారీలో జాప్యంపై కందికుప్ప శివారు బొజ్జావారిపేటకు చెందిన బొజ్జా విజయలక్ష్మి ఫిర్యాదుపై తహసీల్దార్ విచారణ చేశారు. తన రెండెకరాల భూమికి పట్టాదారు పాసుపుస్తకం రాకుండా కొందరు అడ్డుపడుతున్నారని బాధితురాలు వివరించారు. రెండు నెలల్లో పాస్ పుస్తకం ఇస్తామని తహసీల్దార్ సురేష్‌కుమార్ హామీ ఇచ్చారు.

సీపీఎం మండల కార్యదర్శిగా రాంబాబు

సీపీఎం మండల కార్యదర్శిగా విత్తనాల రాంబాబు ఎన్నికైనట్టు పార్టీ సభ్యుడు జి.దుర్గాప్రసాద్ తెలిపారు. గెద్దనపల్లిలో పార్టీ మహాసభ నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కారెం వెంకటేశ్వరరావు, విప్పర్తి మోహనరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికే పల్లె పండుగ: బుచ్చిబాబు



కొత్తలంకలో పల్లెపండుగలో సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

ముమ్మిడివరం, అక్టోబరు 14: గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పల్లెపండుగ, పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు(బుచ్చిబాబు) పేర్కొన్నారు. మండలంలో సోమవారం పల్లెపండుగ, పంచాయతీ వారోత్సవాలు ఎమ్మెల్యే ప్రారంభించారు. మండలంలో అన్నాతరం, సీహెచ్.గునేపల్లి, ఐనాపురం, కొత్తలంక, చినకొత్తలంక, మర్లపాలెం, కర్రివానిరేవు, గేదెల్లంక, గాడిలంక, అన్నంపల్లి, రాపచింతలపూడిపాలెం, పల్లవారిపాలెం తదితర గ్రామాల్లో సోమవారం నిర్వహించిన పల్లెపండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామాల మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల విధ్వంస పాలనలో అభివృద్ధి లేక గ్రామాలు అంధకారంలో మునిగిపోయ్యాయన్నారు. సుపరిపాలన అందించే దిశగా కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఎన్ఆర్‌జీఎస్ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 51 గ్రామాల్లో రూ.13.43కోట్లతో 24.150కిలోమీటర్ల మేర సీసీరోడ్లు చేపడతామన్నారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాయకులు గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, తాడి నరసింహరావు, అర్దాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణకుమార్, చిక్కాల అంజిబాబు, గుద్దటి జమ్మి, పొదోకు నారాయణరావు, దూడల స్వామినాయుడు, గోదాసు పుండరీష్, గొల్లపల్లి గోపి, యాళ్ల ఉదయ్, దాట్ల బాబు, గేదెల రాఘునాథ్‌బాబా, నిమ్మితి చిరంజీవి, దంగేటి శ్రీనివాస్, కురసాల శివబాబు, గీసాల చంద్రరావు, దాసరి సాయిబాబు, బొంతు నాగరాజు పాల్గొన్నారు.

పుష్కర కాలమైనా పూర్తికాని ఇరిగేషన్ పనులు





మారేడుబాక వద్ద మధ్యలోనే నిలిచిపోయిన వంతెన పనులు, తాపేశ్వరం లాకులు వద్ద అసంపూర్తిగా సిబ్బంది క్వార్టర్స్

మండపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఏపీ ఉమ్మడి రాష్ట్రంగా ఉండగా 2012లో చేపట్టిన పంట కాల్వలపై వంతెనల ఆధునికీకరణ పనులు నేటికి ఇంకా పూర్తి కాలేదు. రాష్ట్రం విభజన జరిగిన తర్వాత రాష్ట్రంలో రెండు ప్రభుత్వాలు మారినప్పటికి తాపేశ్వరం ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో చేపట్టిన పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. మండపేట - రామచంద్రపురం పంటకాల్వపై వీరభద్రపురం, మారేడుబాక బల్లకట్టు వద్ద నిర్మించిన వంతెనలు పునాదుల స్థాయి దాటలేదు. వాటి గురించి ఇప్పటివరకు ప్రభుత్వాలు పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు. తాపేశ్వరం లాకులు వద్ద సిబ్బంది క్వార్టర్స్, కార్యాలయంలో 7భవనాలు పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. అరకొర వసతులు నడుమ కార్యాలయం నడుస్తుంటే సిబ్బంది మాత్రం క్వార్టర్స్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జెడ్.మేడపాడు లాకులు వద్ద నిర్మించిన ఇరిగేషన్ క్వార్టర్స్ మధ్యలోనే నిలిచిపోయాయి. మధ్యలో నిలిచిపోయిన నిర్మాణాలు చీకటిపడితే మందుబాబులకు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారి పోతున్నాయి. అసంపూర్తిగా ఉన్న ఇరిగేషన్ పనులు పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వానికి ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.





తాపేశ్వరంలో అసంపూర్తి భవనంలోనే నడుస్తున్న ఇరిగేషన్ కార్యాలయం, జెడ్.మేడపాడులాకులు వద్ద అసంపూర్తిగా మిగిలిపోయిన క్వార్టర్స్

సమస్యల నడుమ గ్రంథాలయాలు







కపిలేశ్వరపురం శాఖా గ్రంథాలయం, మెస్ లేకుండా ఉన్న వరండా, పాతభవనంలో కొనసాగుతున్న అంగర శాఖా గ్రంథాలయం

కపిలేశ్వరపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు సమస్యలతో సతమతమవుతున్నాయి. కపిలేశ్వరపురం, అంగర గ్రామాల్లో శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి. జనాభా ఎక్కువగా ఉన్న ఈగ్రామాల్లో రెండు ఉన్నత పాఠశాలలు, పలు ప్రాథమిక పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. దీంతో విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం చేస్తుంటారు. అంగర గ్రంథాలయం ప్రైవేటు భవనంలో అద్దె లేకుండా కొన్నేళ్లుగా కొనసాగుతోంది. పైకప్పు అక్కడక్కడా దెబ్బతినడంతో వర్షం నీరు గదుల్లోకి దిగి పుస్తకాలు, గ్రంథాలు తడిసిపోతున్నాయి. దీంతో బరకాలు, ఫ్లెక్సీలు కప్పి వాటిని కాపాడుకోవాల్సి వస్తుందని గ్రంథాలయాధికారిణి శివకుమారి తెలిపారు. సరైన ఫర్నీచర్ లేకపోవడంతో సెల్ఫ్‌లో ఎక్కడి పుస్తకాలు అక్కడే బయట ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ సరైన వసతులు, మౌలిక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం లేదు. నాలుగేళ్లుగా క్రితం అంగర లైబ్రేరియన్ ఉద్యోగ విరమణ చేయడంతో కపిలేశ్వరపురం లైబ్రేరియన్ మూడు రోజులు ఒక చోట, మూడు రోజులు మరో చోట పనిచేస్తున్నారు. కపిలేశ్వరపురం గ్రంథాలయానికి పక్కా భవనం ఉన్నప్పటికీ పాఠకులు వరండాలో చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అక్కడ వరండాకు మెస్ ఏర్పాటు చేస్తే పుస్తకాలు, పేపర్లు భద్రంగా ఉంటాయని, ఓపెన్‌గా ఉండడంతో కనీసం ఫ్యాన్లు, బల్బులు ఏర్పాటు చేసే వీలులేకుండా పోయిందని లైబ్రేరియన్ తెలిపారు. అధికారులు, నాయకులు స్పందించి అంగరకు ప్రభుత్వ భవనంతో పాటు రెగ్యులర్ లైబ్రేరియన్ నియమించాలని, కపిలేశ్వరపురం గ్రంథాలయానికి మెస్ ఏర్పాటు చేయాలని ప్రజలు, పాఠకులుకోరుతున్నారు.







ఫర్నీచర్ లేక సెల్ఫ్‌లోనే ఓపెన్‌గా ఉన్న పుస్తకాలు, పాఠకులు చదువుకునే హాలు, వర్షానికి పుస్తకాలు తడవకుండా బరకాలు కప్పిన దృశ్యం

క్షయవ్యాధి అంతం.. మనందరి పంతం

అంతర్వేది(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: జాతీయ క్షయవ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా సఖినేటిపల్లి లంక గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద క్షయవ్యాధిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. క్షయవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధి సోకిన వారు వైద్య సిబ్బంది సలహాలు పాటిస్తూ డాట్ చికిత్సా పద్ధతి విధానాన్ని పాటించాలని సూచించారు. సఖినేటిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద కళ్ల పరీక్ష చేయించుకోవాలని, అత్యాధునిక ట్రూనాట్ పరికరం ద్వారా వ్యాధి నిర్ధారణ చేసిన వారికి చికిత్స ఉచితంగా ఇంటి వద్దే డాట్ పద్ధతిలో ఆశ కార్యకర్త అందజేస్తారన్నారు. చికిత్స కాలంలో నవంబరు నెల 1వ తేదీ నుంచి రూ.వెయ్యి చెల్లిస్తారని డాక్టర్ సీహెచ్ దుర్గాకావ్య తెలిపారు.

జనసేన నాయకుడికి మంత్రి పరామర్శ

కె.గంగవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కె.గంగవరం మండల జనసేన సీనియర్ నాయకుడు దేవరపల్లి చక్రి తండ్రి శ్రీనివాస్ ఇటీవల మృతి చెందారు. సత్యవాడలో ఆయన స్వగృహంలో చక్రిని మంత్రి సుభాష్ పరామర్శించి సానుభూతి తెలిపారు. తోట వెంకన్న, ఉపసర్పంచ్ సలాది శ్రీనివాసు, సలాది రమేష్ పాల్గొన్నారు.

పల్లె పండుగ ప్రగతికి పునాది: ఎమ్మెల్యే దేవ



కేశవదాసుపాలెంలో పల్లె పండుగ సందర్భంగా సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అంతర్వేది(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: సఖినేటిపల్లి మండలం అంతర్వేది దేవస్థానం, అంతర్వేది పల్లిపాలెం, కేశవదాసుపాలెం, గుడిమూల, గొంది గ్రామాల్లో పంచాయతీ వారోత్సవాలను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రారంభించారు. తొలుత అంతర్వేది లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర ప్రాంత గ్రామాల్లో సీసీ రోడ్లకు భూమిపూజా కార్యక్రమాల్లో పాల్గొని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కొబ్బరికాయ కొట్టారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతీ పల్లెటూరును మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దేందుకు పల్లెపండుగ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. రూ.11.30కోట్లతో 208 గ్రామీణ సిమెంటు రోడ్లకు శంకుస్థాపన వారోత్సవాలు జరగడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, ముప్పర్తి నాని, గుబ్బల పణికుమార్, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, మాలే శ్రీనివాసనగేష్, పినిశెట్టి బుజ్జి, పోతురాజు కృష్ణ, చాగంటి స్వామి, తిరుమాని ఆచార్యులు, డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఉండపల్లి అంజి, ఎంపీటీసీ భైరా నాగరాజు, కూటమి శ్రేణులుపాల్గొన్నారు. సఖినేటిపల్లిపాలెంలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కిమ్స్ ఆసుపత్రి ఛైర్మన్ చైతన్యరాజు సౌజన్యంతో మెడ్ యునైటెడ్ ఆసుపత్రి బ్రాంచిని సోమవారం ప్రారంభించారు.

రేపు రామచంద్రపురంలో జాబ్‌మేళా

అమలాపురం టౌన్(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: జిల్లా ఉపాధి కార్యాలయంలో, స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రముఖ ప్రైవేటు కంపెనీల్లో పనిచేసేందుకు ఈనెల16న రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10.30గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి యూ.వసంతలక్ష్మి తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు, బయోడేటా జిరాక్సు కాపీలతో హాజరు కావాలని, మరిన్ని వివరాలకు సెల్ 8247645389ను సంప్రదించాలన్నారు.



ద్వారపూడిలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల తదితరులు

పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

పల్లె పండుగలో ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి), రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నదని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సారథ్యంలో గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్‌ల పనులు చేపట్టడం ద్వారా ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. మండపేట నియోజకవర్గంలో రూ.7 కోట్లతో సీసీరోడ్లు, డ్రైన్‌ల పనులు చేపడుతున్నామన్నారు. ఈ పనులను డిసెంబరు నాటికి పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. మండలంలో సోమవారం పల్లె పండుగలో ఎమ్మెల్యే వేగుళ్ల స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి రహదారులు పనులకు శంకుస్థాపనలు చేశారు. ద్వారపూడి, ఇప్పనపాడు, మారేడుబాక, తాపేశ్వరం, జెడ్.మేడపాడులలో చేపట్టే సీసీ రోడ్డు, డ్రైన్ పనులకు సర్పంచ్‌లు, అధికారులతో కలిసి ఆయన శంకుస్థాపనలు చేశారు. శంకుస్థాపనల అనంతరం రోడ్లు వేసే ప్రదేశాలను ఆయన స్కూటర్‌పై వెళ్లి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మారేడుబాక, తాపేశ్వరం, ఇప్పనపాడు, జెడ్.మేడపాడు, ద్వారపూడి సర్పంచ్‌లు గోవిందరాజులు, వాసంశెట్టి రాజేశ్వరి శ్రీనివాస్, కుంచే వీరమణి ప్రసాద్, కంచర్ల చంద్రశేఖర్, ఈతకోట కిన్నెర, ఎంపీడీవో సత్యనారాయణ, ఈవోపీఆర్‌డీ దాసరి శ్రీను, పంచాయతీ కార్యదర్శులు ఆకుల వీవీరమణ, ఎస్‌వీవీ సుబ్బారావు, అమర్‌నాథ్ చౌదరి, గ్రంథాలయ మాజీ ఛైర్మన్ వీర్రెడ్డి, పాలచర్ల శిరిష్, టీడీపీ మండల అధ్యక్షుడు యరగతపు బాబ్జి, ఎంఎసీ మాజీ ఛైర్మన్ రమేష్‌రాజు, సత్తి సత్యనారాయణ, చింతా దొరబాబు, మాజీ సర్పంచ్ మండా వీరభద్రరావు, శెట్టి రవి, వివిధ శాఖల అధికారులు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురంలో మెడ్ యునైటెడ్ సేవలు

ఆత్రేయపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురంలో మెడ్ యునైటెడ్ సూపర్ స్పెషాల్టీ క్లినిక్‌ను కిమ్స్ ఛైర్మన్ చైతన్యరాజు, ఎండీ రఘువర్మ సారథ్యంలో ఏర్పాటు చేశారు. సోమవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దీన్ని ప్రారంభించారు. ప్రభుత్వ సహకారంతో 20 ఏళ్లుగా కిమ్స్ ఆధ్వర్యంలో వైద్య సేవలందిస్తున్నదని ఎమ్మెల్యే అన్నారు. గ్రామీణ ప్రాంతంలో వైద్య సేవలందించడానికి మెడ్ యునైటెడ్ ఆసుపత్రి ద్వారా సేవలందించడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, ముదునూరి రామరాజు తదితరులతో పాటు, మెడ్ యునైటెడ్ ఎండీ కల్యాణ్, బిజినెస్ ఆఫీసర్ నాగేంద్ర విజయ్ తదితరులు పాల్గొన్నారు.



వ్యక్తిగత లబ్ధి కోసమే టీడీపీలో చేరికలు

మండపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండపేట మున్సిపాల్టీలో వైసీపీ కౌన్సిలర్‌లు ఆ పార్టీకి రాజీనామాలు చేసి టీడీపీలో చేరటం కేవలం వారి వ్యక్తిగత స్వార్థం కోసమే తప్ప మరేమీ కాదని వైసీపీ పట్టణ అధ్యక్షుడు ముమ్మిడివరపు బాపిరాజు, షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీఖాన్ బాబాలు ఆరోపించారు. సోమవారం వారు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. వైసీపీ తరపున కౌన్సిలర్‌లుగా పోటీచేసి గెలుపొందిన కౌన్సిలర్‌లు ఇప్పుడు టీడీపీ గూటికి చేరి అభివృద్ధి కోసమే అంటూ చెప్పటం సరికాదన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఛైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి పట్టణంలో ఎంతో అభివృద్ధి చేశారన్నారు. పార్టీలు మారేవారు పదవులకు రాజీనామా చేస్తే మంచిదని వారు సలహా ఇచ్చారు.

మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి 15రోజుల జైలు

ఆలమూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి 15 రోజుల జైలుశిక్ష విధిస్తూ ఆలమూరు కోర్టు న్యాయమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లాకు చెందిన దాకారపు రమేష్‌బాబు మద్యం సేవించి ఈనెల 8న లారీ డ్రైవ్ చేస్తుండగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆలమూరు జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి వి.నాగేశ్వరరావు నాయక్ సోమవారం తీర్పు చెప్పారు. మద్యం సేవించి వాహనం నడిపినందుకు నిందితుడికి 15 రోజుల జైలుతో పాటు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్ఐ అశోక్ తెలిపారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం



అన్నదాన భవన నిర్మాణానికి విరాళం ఇస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి నర్సీపట్నానికి చెందిన ఇలిశెట్టి వీరపాత్రుడు, వెంకటేశ్వరి దంపతులు లక్ష విరాళం అందించారు. సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.3,01,744 వచ్చినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం చక్రధరరావు తెలిపారు.

లంక భూముల సమస్యలు పరిష్కరించండి

కొత్తపేట ఆర్డీవోకు రైతుల వినతి



ఆర్డీవో శ్రీకర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

కొత్తపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా జిరాయితీ భూములుగా ఉన్న లంక భూములకు రిజిస్ట్రేషన్ లావాదేవీలు జరగడం లేదని, వాటిపై ఉన్న 22/ఏ సెక్షన్‌ను తొలగించాలని కోరుతూ కొత్తపేట ఆర్డీవో శ్రీకర్‌కు రైతు నాయకుడు కంఠంశెట్టి శ్రీను ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 22/ఏ సెక్షన్ వల్ల కొత్తపేట, మందపల్లి, కేదారలంక, లంక భూములు క్రయవిక్రయాలు జరగడం లేదని ఆర్డీవోకు తెలిపామన్నారు. ఈ భూములన్నీ చిన్న, సన్నకారు రైతులకు చెందినవే కావడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ప్రభుత్వం స్పందించి 22ఏ సెక్షన్‌ను తొలగించి ఆదుకోవాలని రైతులు కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుబ్బల మూర్తి, భూముల రైతులు పాల్గొన్నారు.

సర్పంచ్‌తో పాటు మరో ఇద్దరికి నోటీసులు

రావులపాలెం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి సర్పంచ్‌తో పాటు మరో ఇద్దరు ఉద్యోగులకు నోటీసులు జారీ చేసినట్టు ఈవోపీఆర్డీ కృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం...పంచాయతీకి సంబంధించి పనులు చేయకుండా బిల్లులు పెట్టి నగదు డ్రా చేశారని, గ్రామానికి చెందిన నామాల నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో సర్పంచ్ దొమ్మేటి అర్జునరావు, కార్యదర్శి ఫణి, అసిస్టెంట్ గంగోళిలకు నోటీసులు జారీ చేశామన్నారు. డీఎల్‌పీవోకు వివరణ ఇవ్వాల్సిందిగా ఈ నోటీసులో పేర్కొన్నట్టు ఆయన తెలిపారు.

అధికారులు ఇంత నిర్లక్ష్యమా... కూటమి ప్రభుత్వ ఆశయం నిర్వీర్యం



ఆత్రేయపురం తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాపరిష్కార వేదికకు కొద్ది మంది అదికారులు మాత్రమే హాజరైన దృశ్యం

ఆత్రేయపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మండల స్థాయిలో ప్రజా పరిష్కార వేదిక నిర్వహిస్తోంది. అయితే అధికారులు ఈకార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదు. ముఖ్యమైన కార్యక్రమానికి డుమ్మా కొట్టి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు 30మంది వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు హాజరుకావాల్సి ఉంది. 12మంది మాత్రమే రిజిస్టర్‌లో సంతకాలు చేయగా తహసీల్దారుతో పాటు మరో ఆరుగురు మండల స్థాయి అధికారులు మాత్రమే గ్రీవెన్స్‌లో పాల్గొన్నారు. గత కొన్ని వారాల నుంచి ఇదే తంతు జరుగుతోంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కార్యక్రమంపై కొంత మంది అధికారులు నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నారు. అధికారులే రాని సమావేశానికి జనం మాత్రం వచ్చి ఏ సమస్యలు చెబుతారు అందుకే అర్జీదారుల సంఖ్య కూడా రోజురోజుకూ తగ్గిపోతోంది.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయ మని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ప్రజాదర్బారు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ప్రజల సమస్యలను పట్టించుకోలేదన్నారు. వాటిని పరిష్క రించేందుకే ప్రభుత్వం ప్రజాదర్బారులో వినతులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, ఆకుల రామకృష్ణ, గుత్తుల పట్టాభిరామారావు, సర్పంచ్‌లు తాడేపల్లి నాగమణి, కొక్కిరిగడ్డ లక్ష్మీనరసింహమూర్తి, గొలుగూరి మునిరెడ్డి, జడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, గుత్తుల పట్టాభిరామారావు, నందం వీరవెంకటసత్యనారాయణ, ఎం.గురవయ్యానాయుడు పాల్గొన్నారు. రావులపాలెం పంచాయతీ వద్ద నిర్వహించిన ప్రజాదర్బారులో 359 అర్జీలు వచ్చినట్టుసెక్రటరీ దుర్గాప్రసాద్ తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

కొత్తపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్టు కొత్తపేట ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. మోడేకుర్రు గ్రామశివారు గొలకోటివారిపాలేనికి చెందిన ఈతకోట నాగరాజు(48) కూలి పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఆదివారం రాత్రి పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే గుర్తించిన భార్య సత్యవతి, కొడుకు అవినాష్ 108 అంబులెన్సులో కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్టు నిర్ధారించారు. భార్య సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సురేంద్ర తెలిపారు.

పోస్టల్ శాఖ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు

మండపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలు అందించటమే పోస్టల్ శాఖ లక్ష్యమని రాజమహేంద్రవరం పోస్టల్‌శాఖ డివిజన్ సూపరింటెండెంట్ కె.శేషారావు అన్నారు. మండపేట మెయిన్ రోడ్డులో వున్న పోస్టాఫీస్ 36 ఏళ్ల నుంచి సేవలందిస్తోందన్నారు. పోస్టల్‌శాఖ కార్యాలయాన్ని అక్కడ నుంచి ఆంధ్రా బ్యాంకు వీధిలో వున్న భవనంలోకి సోమవారం మార్చారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమానికి పోస్టల్ సూపరింటెండెంట్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో పోస్టుమాస్టర్ సుబ్బారెడ్డి, కె.వినారాయణరావు. కొండపల్లి సూర్యనారాయణ పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా మృత్యుంజయరావు బాధ్యతల స్వీకరణ

కె.గంగవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కె.గంగవరం తహశీల్దార్‌గా బండి మృత్యుంజయరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ తహశీల్దార్ మురళి, ఆర్ఐ వీఆర్వోలు, వీఏఏలు తహశీల్దార్‌ను అభినందించారు. ఇక్కడ పనిచేసిన కె.సూర్యారావు అల్లూరి జిల్లా బదిలీ అయ్యారు.